ఆదివారము

Reg. No. M. 4479.

ఆంధ్రపత్రిక

విడిపత్రిక అణా

Founder: K. NAGESWARA RAO

Editor: S. SAMBHU PRASAD

Vol. 1 ★ ANDHRA PATRIKA, MADRAS, SUNDAY, 16-8-42 ★ No. 11

వెంకట్రావు అరెస్టు

—(:)—

బెజవాడ మునిసిపలు చైర్మెను ఇంటి సోదా

నురిలొంతమంది ప్రముఖుల అరెస్టులు

(మా విలేఖరుల వద్దనుండి)

కాకినాడ, ఆగస్టు 13:—

ఆం. రా. కాం. సంఘ కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావుగారిని నిన్న అమలాపురములో పోలీసువారు అరెస్టుచేసి జిల్లాలో డిటెన్షనుకు తీసికొనిపోయిరి.

కాకినాడ విద్యార్థిసంఘమువారు యీ సాయంత్రము ఒక సభ జరిపి జాతీయనాయకులను విడుదల జేయవలెనని కోరుచును, విద్యార్థులపై కాల్పులను ఖండించుచును, కేంద్రమున ప్రొవిజనలు ప్రభుత్వము నేర్పరుపవలెననికోరుచును తీర్మానించిరి. డి.ఎస్. చౌదరిగారు అధ్యక్షత వహించిరి. (స్వ. వి.)

తూర్పు గోదావరి జిల్లా బోర్డు ఆఫీసు సోదా

కాకినాడ, ఆగస్టు 12:—

నిన్నటి రోజున మధ్యాహ్నము తూర్పు గోదావరి జిల్లా బోర్డు ఆఫీసు, శ్రీ మొసలికంటి తిరుమలరావుగారి యిల్లు పోలీసువారు సోదా చేసిరి. (స్వ. వి.)

శ్రీ కల్లూరి చంద్రమౌళి ప్రభృతుల అరెస్టు

తెనాలి, ఆగస్టు 13:—

నేడు తెనాలిలో జిల్లా కాంగ్రెసు కార్యాలయములోనున్న శ్రీ కల్లూరి చంద్రమౌళి, శ్రీ శరణు రామస్వామిచౌదరిగార్లను శ్రీ రావి సత్యనారాయణచౌదరి బైరన్ గారిని శ్రీ మోటుపల్లి బాబురావు, శ్రీ చింతమనేని బావయ్యచౌదరి, మహమ్మద్ ఇస్మాయిల్ సాహెబుగార్లను అరెస్టుగావించి గుంటూరునకు తీసికొనిపోయిరి. (స్వ. వి.)

గుంటూరు, ఆగస్టు 12:—

శ్రీయుత కల్లూరి చంద్రమౌళి ఎం.ఎల్.ఏ., శరణు రామస్వామి చౌదరి గార్లను పోలీసులు తెనాలిలో అరెస్టు చేసి ఈదినము గుంటూరుకు తీసికొనివచ్చిరి. (స్వ. వి.)

ఎలమంచిలిలో అరెస్టులు

ఆగస్టు 14:— ఇండియా దేశరక్షణ చట్టము ననుసరించి, బిల్లాబోర్డు మెంబరు శ్రీ మిన్నుల చిరంజీవిగారిని, సర్కిలు యిన్‌స్పెక్టరుగారు ఎరెస్టు చేసి, రిమాండునం దుంచి నేటిదినము నర్సీపట్నం సబ్ కలెక్టరుగారి వద్దకు తీసికొని వెళ్లిరి.

శ్రీ శిష్ట్లా కామేశ్వరరావు అను కాంగ్రెసు సభ్యుడు 12 తేదీని యిండియా డిఫెన్సు రూల్సుక్రింద అరట్లకోట గ్రామములో ఎరెస్టు చేయబడి నర్సీపట్నం సబ్ కలెక్టరు గారిదగ్గరకు నిన్నటిదినము తీసికొని పోబడిరి. (స్వ. వి.)

బెజవాడ మున్సిపలు చైర్మెను ఇంటి సోదా

బెజవాడ, ఆగస్టు 12:—

బెజవాడ మునిసిపల్ చైర్మన్ శ్రీమాన్ సి. రాజగోపాలాచారిగారిఇల్లు బెజవాడ పోలీసువారిచే సర్చిచేయబడెను. అచ్చట ఏమీ దొరకలేదు.

ఈరోజుకూడ ఇక్కడ హర్తాలు చేయబడెను.

బెజవాడలో అరెస్టులు

బెజవాడదగ్గర అనుమర్రు కాపురస్థులు న్నూ, బెజవాడలోని విజయవాడ కోఆపరేటివు సెంట్రల్ బ్యాంకు డైరక్టరు నగు కాకాని వెంకటరత్నంగారిని బ్యాంకు భవనమునందువుండగా పోలీసువారు అరెస్టుచేసిరి. కంకిపాడులో మద్దాలి జగన్నాథంగారిని అరెస్టుచేసిరని తెలియుచున్నది. వీరు జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు.

"సాధన" పత్రిక సంపాదకుని అరెస్టు

అనంతపూరు, ఆగస్టు 15.—

సాధనపత్రిక సంపాదకులు శ్రీ పప్పూరు రామాచార్లుగారు దేశరక్షణ నిబంధనలక్రింద మధ్యాహ్నం అరెస్టు చేయబడిరి.

ఆంధ్ర ఇతిహాసాన్నుకంపెనీ బ్రాంచి మేనేజరు శ్రీ పల్లూరు రామారావుగారు కూడా అరెస్టు చేయబడిరి.

చిత్తూరులో శిక్షలు

చిత్తూరు, ఆగస్టు 14:—

చిత్తూరులో గత మూడుదినముల క్రింద క్రిమినల్ లా అమెండుమెంటు ఆక్టుక్రింద అరెస్టుకాబడిన విద్యార్థులు, తదితరులున్ను

(3-వ పేజి చూడుడు)

ఢక్కాలో అల్లర్లు-పోలీసుకాల్పులు

కలకత్తాలో రివాల్వరు కాల్పులు

ఇతర నగరాలలో సౌమ్యపరిస్థితులు

అస్సాం మాజి కాంగ్రెసు ప్రధాని అరెస్టు

కలకత్తా ప్రజలపై రివాల్వరుకాల్పులు

కలకత్తా, ఆగస్టు 15:—

నేటిదినం కలకత్తాలో అచ్చటచ్చట చేరిన గుంపులను చెదరగొట్టుటకై పోలీసువారు ప్రజలపై మూడు పర్యాయములు రివాల్వరులతో కాల్పవలసివచ్చెను. కారను వాలీసువీధి సెంట్రలు అవెన్యువద్ద ప్రజలు ఎక్కువగ అల్లరిచేయుటచే ఈ రెండు చోట్ల రివాల్వరులు ప్రేల్చబడెను. పెక్కుమందికి గాయములు తగిలినవి. గాయములు తగిలినవారు చికిత్సకై వైద్యశాలకు తీసికొని పోబడిరి.

పెక్కుచోట్ల పోలీసులు లాఠీఛార్జీలు చేసి గుంపులను చెదరగొట్టిరి. ఉత్తరదక్షిణ కలకత్తాలలో ప్రదర్శనములు జరిగినట్లు వార్తలు వచ్చినవి.

విద్యా సంస్థలమూత

కలకత్తాలోని అన్నివిద్యాసంస్థలు రాబోవు వారమంతా మూయబడియుండును.

రైల్వేస్టేషను తగుల బెట్టబడుట

కలకత్తా, ఆగస్టు 15:—

ఇట్టు ఇండియా రైల్వేలైనులో ఖగల్పూరు సమీపమున నున్న కుల్గంజ్ రైల్వే స్టేషను తగుల బెట్టబడెననియు, టికెట్లు రొక్కము దోపిడి చేయబడెననియు వార్త వచ్చినది.

ఢక్కాలో పోలీసుకాల్పులు

ఢక్కా, ఆగస్టు 15:—

నేటిదినం ఢక్కాలో ప్రజలు గుంపుగ చేరి అల్లరిచేయ ప్రారంభించిరి. పోలీసువారిపై రాళ్లు రువ్వబడెను. పోలీసువారికి సహాయముచేయ సైనికులు పిలవనంపబడిరి. గుంపుపై తుపాకులు ప్రేల్చబడెను. 5 మంది మరణించిరి. నలుగురికి గాయాలు తగిలినవి.

నగరానికి నష్టము

నగరంలో పెక్కుచోట్ల టెలిగ్రాపు, టెలిఫోను తీగెను తెగగొట్టబడెను. గుంపులు గండేలియ రైల్వే స్టేషనుపై దాడిచేసి రికార్డులను తగులబెట్టిరి. నగరములో పెక్కు బాంకులు, పోస్టాఫీసులు మూసివేయబడినవి. యువకులు కొకదరు ఈడెను బాలికల కళాశాలమీదను మరికొన్ని విద్యాసంస్థలమీదను దాడిసలిపి ఆస్తికి అధిక మగు నష్టము కలుగజేసి రికార్డులను తగులబెట్టిరి. 34 మంది అరెస్టు చేయబడిరి. 5 మంది కన్న ఎక్కువమంది గుంపుగ చేరకూడదని నిషేధపు టుత్తరువు ప్రకటింపబడినది.

ఇతర నగరాలలో సౌమ్యపరిస్థితులు

బొంబాయి, ఆగస్టు 15:—

బొంబాయినగరంలో పరిస్థితులు సౌమ్యరూపం దాల్చుచున్నవి. నగరంలో సోర్జర్లు కాపలా తీసివేయబడినది. అన్ని చోట్ల పోలీసువారే కాపలా కాయుచున్నారు.

ఢిల్లీలో పరిస్థితులు సౌమ్యముగనున్నవి. కర్ఫ్యూ ఉత్తరువు మరి రెండు రోజులు అమలునం దుండు నని ప్రకటింపబడినది.

నాగపూరులో పరిస్థితులు మామూలు స్థితికి వచ్చుచున్నవి.

సంయుక్త రాష్ట్రాలలో ఆగ్రా, మీరటు, అలహాబాదు, కాన్పూరు, లక్నో నగరాలలో పరిస్థితులు సౌమ్యముగ వున్న పనియు, మిల్లులు పనిచేయుచున్న పనియు వార్తలు వచ్చినవి.

గోరక్పూరు పోలీసు కాల్పులు

గోరక్పూరు, ఆగస్టు 15:—

నేటిదినము గోరక్పూరులో ప్రజలు గుంపుగ చేరి అల్లరి జరుపుటచే పోలీసువారు తుపాకులు ప్రేల్చిరనియు ఈ కాల్పులల్ల ఒకరు మరణించిరనియు 12 మందికి గాయములు తగిలినవనియు జిల్లా మాజిస్ట్రేటు ప్రకటించుచున్నారు.

కాశీలో 26 బారులు కాల్చబడెను

బెనారసు, ఆగస్టు 13:—

బెనారస్ ప్రజలు గుంపుగచేరి అల్లరి చేయుటచే నేటిదినం పోలీసులు 26 బారులు తుపాకులను ప్రేల్చి గుంపును చెదరగొట్టిరి. ప్రజలలో ఒకడు మరణించెను. 12 మందికి గాయములు తగిలెను. ఇరువురు మాజిస్ట్రేటులకు నలుగురు కాన్‌స్టేబిలులకు గాయములు తగిలినవి. పోలీసువారు కాంగ్రెసుపతాకములను లాగుకొని గుంపు చెదిరిపోవలెనని హెచ్చరిక తెలిపిరి. కాని ప్రజలు చతికిలబడి కూర్చొని పోలీసు హెచ్చరికలు పాటింపలేదు. అందుపై లాఠీఛార్జి చేయబడెను. అప్పుడుకూడ గుంపు చెదరిపోనందున పోలీసువారు తుపాకులను ప్రేల్చి గుంపును చెదరగొట్టవలసివచ్చెను.

అస్సాం మాజి ప్రధాని అరెస్టు

దుబ్రి, ఆగస్టు 15:—

అస్సాం మాజి కాంగ్రెసు ప్రధాని గోపీనాథ్ బార్డోలీగారు దేశరక్షణచట్టంక్రింద అరెస్టుచేయబడిరి.

వార్ధాలో అరెస్టులు

వార్ధా, ఆగస్టు 15:—

చందా వాస్తవ్యులు శాసనసభ్యులు సేత్ కమలాలుచంద్ కగాలిగారు, శ్రీ॥ శ్రీ॥ బజాజుగారి కుమారుడు రామకృష్ణ బజాజుగారు అరెస్టుచేయబడిరి.

మహాదేవదేశాయి నిర్యాణము

నిర్బంధంలో ఆకస్మికమరణం

మహాత్ముని ఆంతరంగిక కార్యదర్శి : శిష్యుడు

బొంబాయి, ఆగస్టు 15:—

గాంధిమహాత్ముని కార్యదర్శి మహాదేవదేశాయి నేటిదినం ఉదయం 8-40 గంటలకు మరణించిరని బొంబాయిప్రభుత్వమువారు ఒక ప్రకటన గావించిరి.

యీ దినం శ్రీ దేశాయిగారు మహాత్మా గాంధి తదితరులతో నిర్బంధింపబడి యుండిరి.

శ్రీ మహాదేవదేశాయి గారీవాళ ప్రొద్దున కలనలు ఖండారి ఐ. యం. యస్. కారాగృహముల ఇన్‌స్పెక్టరు జనరలుగారితోను యిద్దరు ఖైదీలతోను సంభాషించుచుండి తనకు మైకముగా నున్నట్లు చెప్పిరి. వెంటనే కలనలు ఖండారిగా రాతెనిని పడుకోమని సలహాయిచ్చి నాడిపట్టి చూడగా నాడి బలహీనంగానుంటూ దేహం చల్లబడుచుండినట్లు దోచెను. అదే భవనమున నిర్బంధమున నుండిన డా॥ సుశీలనాయరు వెంటనే పిలవపంపబడిరి. సివిలుసర్జను వెంటనే దొరకనందున నొక ఐ. యం. ఎస్ ఆఫీసరును పిలువనంపి శ్రీ దేశాయిగారికి ఇంజెక్షను యివ్వబడెను. కాని దేశాయిగారి స్థితి విషమించి ఆతనిని బ్రతికించుటకు సర్వ యత్నములు గావించినను 20 నిమిషములలో హృదయ చలన మాగి మరణించిరి.

హిందూ ఆచారప్రకారం శ్రీ దేశాయి గారిదేహము మధ్యాహ్నమున ఆనిర్బంధావాసము సమీపమునసే దహనం గావింపబడెను. ఆ సమయమందు హాజరైయుండిన మహాత్మాగాంధిగారి కోరికప్రకారం శవదహన ఏర్పాట్లు గావింపబడెను.

జీవితసంగ్రహం

చనవుగా "యం. డి." అని పిలువబడుచుండిన శ్రీ హీరాలాలు మహాదేవ దేశాయి గారు గాంధీజీ శిష్యుడుకాక పూర్వం నెనుక 1917-18 సంవత్సరములలో హోంరూలు లీగు ఆర్గనైజింగు సెక్రెటరీగా నుండిరి. అతడు గాంధీజీ శిష్యుడై తరువాత మహాత్ముని ఆంతరంగిక కార్యదర్శియై యుండిరి. అలహాబాదు "ఇండిపెండెంట్" పత్రికయొక్క వ్రాతప్రతినొక దానిని అతడు తన సంపాదకత్వమున ప్రచురించెను. అందుకై దాని నరావతును ప్రభుత్వం వశపరుచుకొనెను. గాంధీజీ మనోభావాలు తత్వాలు కడు శుద్ధముగా ఎరిగినవాడైనందున అతడు యంగ్ ఇండియా అనంతరం హరిజన్, నవజీవన్ వారపత్రికల ప్రచురణకార్యమున గాంధీగారికి అత్యంతముగా తోడ్పడిరి. దేశానికిగాను అనేకమారులు 1921-22 1930; 1932 సంవత్సరములలో అతడు కారాగృహమునకు వెళ్లెను. ఇప్పుడు పూనాలో గాంధిగారితోపాటు నిర్బంధమున నుండినపుడే మరణించిరి.

మహాదేవ్ మరణం-దేశానికి గొప్పనష్టం

గిరిగారి సంతాపము

మద్రాసు, ఆగస్టు 16:—

శ్రీయుత వి. వి. గిరిగారు యిట్లు వ్రాయుచున్నారు.

శ్రీయుతులు మహాదేవదేశాయిగారి మరణవార్త విని దేశ మంతయును నిర్విణ్ణమైనది. ఆయన సేవాగ్రామములో ఉండే మౌన ముద్రధారి. కాని, గాంధిమహాత్మునకు చేయుచూలగ పనిచేయుచుండిన గొప్ప ఉత్సాహపూరితుడు. ఆయనకు దేశభక్తి అనేది ఒక విధమైన ఆనందరసావేశము నంటిది. ఆయన మరణించినందువల్ల దేశానికి తీరనినష్టం కలిగింది. ఆయన మరణముకై దేశ మంతయును పరితపించుచున్నది. గాంధిమహాత్మునకు దేశాయిగారు లేని లోటు తొలగజాలదు. గాంధిమహాత్మునకు మాసానుభూతిని ఎరిగించుచున్నాము.

మహాత్మునికి దుర్భరమగు దెబ్బ

—(:)—

మహాదేవ్ మరణానికి సి. ఆర్. విచారం

చెన్నపురి, ఆగస్టు 16:—

శ్రీ సి. రాజగోపాలాచారిగారిని మా ప్రతినిధిచూచి అడుగగ ఇట్లు చెప్పిరి:—

"మహాదేవుని మరణము మహాత్మునికి దురంతము, దుర్భరము అగునష్టము. మహాత్మునికి కుడిభుజము పోయినట్లనవచ్చు. కొన్నివాళ్లుగ దేశాయిగారు హృదయ సంబంధమగు రుగ్మతతో, తీవ్రముగ బాధపడుచుండినట్లు తెలియును, గాని ఇంతలోనే వారిమరణ మాసన్నమగునని తలంచకపోతిమి. దేశములోని స్థితిగతు లెటుల పరిణమించుచున్నవో ఆయన చూచుచుండె ననుకొందును. మహాదేవుడు అదృష్టవంతుడు."

మద్రాసు, ఆగస్టు 14:—

మద్రాసు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలరుపదవికి డా॥ ఎ. లక్ష్మణస్వామి మొదలియారు, హైదరాబాదు వాస్తవ్యులు యం. యస్. హుస్సేనుగారు అభ్యర్థులుగ నామినేటుచేయబడిరి. వీరి ఇరువురి పేర్లు గవర్నరుగారికి పంపబడినవి. వీరిరువురిలో ఒకరిని గవర్నరుగారు వైస్‌ఛాన్సలరుగ నియమించెదరు.

మధురలో మల్లి అల్లరి

—(*)—

గుంటూరులో మిలిటరీ పహారా

చాలా జిల్లాలనుండి నివేదికలు లేవు

మద్రాసు, ఆగస్టు 16:—

మద్రాసు ప్రభుత్వము వారీ క్రింది ప్రకటనను గావించుచున్నారు:—

మధురలో ప్రజలు బస్సుకు నిప్పు అంటించిరి. ఆస్తి నష్టమయ్యెను. ఇక్కడ మాత్రము పోలీసులు కాల్పులు కాల్చిరి. కాల్పులవల్ల 12 మంది మరణించిన లేక గాయపడినవారై యున్నారు. పరిస్థితులు కంట్రోలులో ఉన్నవి.

పోలీసు మిలిటరీ సిబ్బంది పంపుట కేర్పాటు గావించబడెను.

మన్నార్‌గుడిలో ఆఫీసులకు నిప్పు

మన్నార్‌గుడిలో రైల్వేస్టేషను, మున్సిపల్ ఆఫీసు డిప్యూటీ కలెక్టరు ఆఫీసులు తగులబెట్టబడెను. పోలీసులువచ్చి కాల్పులు లేకయే లాఠీచార్జితో ప్రజలు చెదరగొట్టబడిరి.

గుంటూరులో మిలిటరీ పహారా

మిలిటరీ సిబ్బంది వచ్చుటతోగుంటూరుపరిస్థితులు చక్కబడినవి. నిన్న ఉదయం పహారానిచ్చెను. కొట్లు ఇప్పుడు తెరచియున్నవి. ఇంక గుంటూరు జిల్లాలో విశేషాలేమీ రాలేదు. జిల్లా మొత్తంమీద అంతా శాంతంగా ఉంది.

తిరుమనావల్లి

తిరుమనావల్లిలో ఒక కమ్యునిస్టు ఉపన్యాసకుడు సమ్మెలగూర్చి ఒకసభలో ఉపన్యసించగ ఆ సభ గందరగోళముతో అంతమొందెను.

మొత్తంమీద దారికివస్తోంది

రెండు మూడుజిల్లాలు మినహా రాష్ట్రమంతటా గత 24 గంటలలో పరిస్థితి బాగా దారికి వస్తోంది.

కోయంబత్తూరులో రెండుమిల్లులలో పని ప్రారంభించారు. మరికొందరు సోమవారం చేరవచ్చును.

చాల జిల్లాలనుండి నివేదికలు రాలేదు.

కలకత్తా లైను

రైళ్ల రాకపోకలు

మదరాసు, ఆగస్టు 16:—

కలకత్తామెయిలు, పూరీ పాసింజరు బండ్లు యీవాళ సాయంత్రం సహజముగా ఎప్పటి సమయముననే బయల్దేరి బిట్రగుంటకు వెళ్లి అక్కడ రాత్రిపూటఆగి పగటివేళ అక్కడనుండి వెళ్లును.

ఈవాళ ప్రొద్దున మదరాసుకు రావలసిన కలకత్తామెయిలు సాయంత్రం 4 గంటలపై వచ్చునని నెంచబడుచున్నది. నెం 32 పాసింజరుబండి బిట్రగుంటనుండి సరియైన వేళకు వచ్చును.

నెం. 14 పాసింజరు ఒంగోలునుండి నడుస్తూ యీవాళ రాత్రి 7-5 గంటలపుడు చెన్నపురికి రాగలదని యెంచబడుచున్నది. ఈవాళవలెనే రేపు 17 వ తేదీకూడా గ్రాండుట్రంకు ఎక్స్‌ప్రెసు ఉదయమున చెన్నపురినుండి బయల్దేరి, రాయచూరువాడి మార్గంమీదుగా వెళ్లును.

నేటి సాయంకాలం వచ్చే గ్రాండు ట్రంకు ఎక్స్‌ప్రెసు రేపు ఉదయంవచ్చును.

తిరుపూరు అవల స్టేషనులకు యింకా బండ్లు సంచారిగా పోవని కారణమున టికెట్లు యివ్వడం జరుగదు. ఈదినంకూడా మలబారు కొచ్చిను ఎక్స్‌ప్రెసు బండ్లు నడువవని ఎంచబడుచున్నది. నీలగిరిఎక్స్‌ప్రెసులో తిరుపూరువరకే టికెట్లు యివ్వబడును.

మద్రాసు విద్యార్థి నిశ్చయము

చెన్నపురి, ఆగస్టు 16:—

మద్రాసుకళాశాలల, పాఠశాలల విద్యార్థులకు నిన్న ఇవాళ సెలవుదినములు. దక్షిణ ఇండియా రైల్వేపై నడచు ఎలెక్ట్రిక్ ట్రెయిన్లలో టీచిలో ఎక్కి తాంబరం వరకు టికెట్లు లేకుండా తిరుగుచు, స్వతంత్ర నినాదాలు చేస్తున్నారు. పచ్చయప్పహాస్టలు దగ్గర రైలు పైన పోలీసులు పహారా ఇస్తున్నారు.

రేపటినుంచి సమ్మెను సాగింప నిశ్చయించినటుల తెలియుచున్నది.

ఒకరి అరెస్టు

ఇవాళ మింటువీధిలో పోలీసుకమీషనరు ఆజ్ఞను ఉల్లంఘించి సభను సమావేశపరుపదలచిన శ్రీ ఆర్. కృష్ణమూర్తి మొదల్యారు అరెస్టుచేయబడిరని తెలియుచున్నది.

కడపటి వార్తలు

జపాను నౌకానష్టం

అల్యూషియను దీవులవద్ద

వాషింగటను, ఆగస్టు 15:—

అల్యూషియను దీవులమీనకు జపానువారు దండయాత్ర సాగించినప్పటినుండి యింతవరకు మొత్తం 22 జపానునౌకలు ముంచివేయబడెను. వానిలో 14 యుద్ధనౌకలు 8 రవాణా నౌకలు అని అమెరికా నౌకాశాఖవారు ప్రకటించిరి.

పార్లమెంటు రాయబారం

అంపవలెను

ప్రభుత్వం రాజ్యాంగపరిజ్ఞానాన్ని ప్రదర్శింపవలె

సర్ తేజ్‌బహదుర్ సప్రూగారి సూచన

అలహాబాదు, ఆగస్టు 16:—

సర్ తేజ్‌బహదూర్ సప్రూగారు దేశపరిస్థితినిగురించి నేడొక ప్రకటన చేసియుండిరి. అందు గత ఐదారుదినములుగ దేశములో వివిధ ప్రాంతములందు జరుగుచున్న పరిస్థితులను తాము పరికించుచునే యుంటిమనియు, ప్రభుత్వమువారి తరఫుననిలచి మాటాడగలిగిన వ్యక్తి ఎవరైన నుండిన నేతప్ప సమాధానావకాశము తమకు కనుపించదనియు, బ్రిటిషు పార్లమెంటువారీ దేశమునకు ఒక రాయబారమును పంపవలెననియు, బ్రిటిషు ప్రభుత్వము నిర్మాణాత్మకమైన రాజ్యాంగదక్షతను ప్రదర్శింపవలసిన తరుణ మనియు తెలిపిరి.

దేశమున చెలరేగుచున్న అల్లరులు దేశమునకు హితకరము కావని ఖండించిరి.

ముద్దులొలుకు ముఖారవిందము

మీరు యెన్నడును బడయజాలని గొప్ప ఆస్తి ముద్దులొలుకు ముఖారవిందము.

వేపనూనితో చేయబడిన మార్గోసబ్బు ఒక్కటే సిసలైన సబ్బు. వేపనూనె చర్మమునకు అమూల్యమైన తైలమని చర్మ నిపుణుల ఉద్దేశము.

ప్రతిరోజు మార్గోసబ్బును వాడి మీ ముఖలావణ్యమును కాపాడుకొనుడు.

మార్గో సబ్బు

టాయిలెట్ & మెడిసినల్

కలకత్తా కెమికల్



ఆచరణ సాధ్యమగు పరిష్కారము

వెంటనే జరుగుట అవసరము

ఈ క్లిష్టసమయంలో
మహమ్మదీయుల బాధ్యత

జిన్నాకు సి. ఆర్. సూచన

మదరాసు, ఆగస్టు 15:—

బొంబాయిలో భారతముస్లిం లీగు కార్యసంఘసభ జరుగు సందర్భమున సి. రాజగోపాలాచారిగారు యీరీతిగా వాక్సూచనను చేశారు.

"మనుష్యులలో తప్పుచేయనివారొక్కరు కూడా వుండరు. మనుష్యస్వభావమె అలాటిది. ఇతరులలో తప్పులను కనిపెట్టుటయున్నూ వాటిని మిక్కిలి తీవ్రముగా నిరసించుటయున్నూ మనుష్యుల కందరికికూడా చాలా సులభమైన పనులే. కలిగిన విభేదములను తొలగించి సమాధానమును కుదుర్చుటమాత్రము సులభమైన పనికాదు. ఇది మిక్కిలి కష్టమైన పనియేకాని యిది కొనసాగితేగాని యిండియాకు స్వాతంత్ర్యము లభించదు. ఇండియాలో యిప్పుడేర్పడిన పరిస్థితులలో యే మతమువారైనా గర్వపడుతూ సుఖముగా వుండగలరా? అవమానమునకున్నూ అపాయమునకున్నూ ముస్లిములు కూడా సరిఅవుతూనే వున్నారు గాని వక్క కాంగ్రెసువారు మాత్రమే గురికావడములేదు. కాంగ్రెసు ప్రధాననాయకులందరున్నూ యిప్పుడు చెరసాలల్లో వున్నప్పటికిన్నీ స్వాతంత్ర్యము కోసము తాము సర్వశక్తులను వుపయోగించా మన్న సంతృప్తి వారికి కలుగుట అసహజముకాదు. ముస్లిములీగు ప్రధాననాయకులిప్పుడు జైదులో లేరు. గనక వారి బాధ్యత యిప్పుడు మరింత అధికమయినదేగాని తగ్గలేదు.

వెంటనే ఆచరణసాధ్యమైన పరిష్కారము జరుగవలెను

రెండు పార్టీలవారివల్లను కూడా తప్పులు జరిగాయని ముస్లిములీగు వారంగీకరించక తప్పదు. ఇప్పుడు యిండియా మూడు దావాస్థులమధ్య లేనట్లున్నది. విదేశీయుల పరిపాలనము, దేశములో అల్లరులు, త్వరలోనే జపానువారు యుద్ధమునకు రానుండుట. ఈ మూడు కారుచిచ్చులను దేశమును కాల్చి భస్మము చేయకుండా దేశమును రక్షించుట కిప్పుడొక దారిని కనిపెట్టి తీరవలెను. ఆచరణసాధ్యమైన పరిష్కారము వెంటనే జరగవలె నని ముస్లింలీగుకు చేరినవారిలోకూడా మిక్కిలి హెచ్చుమంది కోరుతున్నారన్న సంగతి జిన్నాగారికి తెలిసేవున్నది. వెంటనే దేశములో తాత్కాలిక ప్రభుత్వము నేర్పరచుట అసాధ్యమైన పనికాదు. గనుక దీని నేర్పరచక తప్పదు. ఈ ప్రభుత్వసంఘ సభ్యులు దేశీయులందరిపక్షమునకూడా మాట్లాడుట కర్హులైనవారుగా వుండవలెను. సంపూర్ణమైన ప్రభుత్వాధికారమును వెంటనే లేకుండ వశపరచవలెనని యీ సంఘమువారు నిష్కర్షగా బ్రిటనుదొరతనమువారిని కోరవలెను. లేనిపోని కారణములనుచెప్పి యిటుపైనికూడా బ్రిటిషుసామ్రాజ్యవాదులు కాలయాపనముచేయుటకు యీ ప్రభుత్వసంఘమువారెట్టి అవకాశమున్నను కలుగకుండా చెయ్యవలెను.

బ్రిటిష్ అధికారం అంతమొందవలెనను కోరిక

ఇండియాలో బ్రిటిషువారి ప్రభుత్వాధికారము పూర్తిగా అంతరించవలెనని కాంగ్రెసువారెంత పట్టుదలతో కోరుతున్నారో అంతపట్టుదలతోనే ముస్లిం లీగువారు కూడా కోరుతున్నారు. ఇండియా ఫెడరేషనులో చేరే రాష్ట్రాలకన్నిటికి స్వయంనిర్ణయాధికారమున్నదని కాంగ్రెసువారిదివరకే స్పష్టంగా వక తీర్మానమును చేసివున్నారు. ఈవిషయములో ముస్లింలీగు వారెంతమాత్రము సందేహపడ నవసరము లేదు. తగిన సమయము వచ్చినప్పుడు ప్రత్యేకముగాను స్వతంత్రముగాను వుండుటకు ప్రతిరాష్ట్రమునకున్న అధికారమున్నది. విదేశాలవారు ఇండియామీదికి యుద్ధానికి వచ్చినప్పుడు మాత్రము యీస్వతంత్రరాష్ట్రాలన్నీ కలసి శత్రువులతో పోరాడవలసి వుంటుంది.

నాప్రయత్నాలు సాగలేదు

ఈ ప్రశ్ననింకా స్పష్టముగా పరిష్కరించవలెనని నేను కాంగ్రెసువారిని కోరాను. దీని విషయంలో శక్తివంచన లేకుండా పని చేశానుగాని నా ప్రయత్నము కొనసాగలేదు. నేను కోరిన వాక్యాలలో యీ హక్కులను స్థిరపరుచుటకు కాంగ్రెసువారంగీకరించలేదు గాని తమకు తోచిన వాక్యాలలో వారివరకే ఈ హక్కును స్థిరపరిచారు. పరోక్షముగా అంగీకరించుటకున్నూ స్పష్టముగా అంగీకరించుటకున్నూ గల భేదమును గురించి నేనిప్పుడు చర్చించదలచుకోలేదు. రాష్ట్రాల కిటువంటి హక్కువున్నదని మాత్రము కాంగ్రెసువారంగీకరించారు. అదే ముఖ్యమైనది. ఈ హక్కు లేదని యెవరూకూడా చెప్పజాలరు. గనుక దీనిమీద ముస్లిములీగువారు ఆధారపడవచ్చును. దేశమును పరిపాలించుటకున్ను, దేశమును రక్షించుటకున్నూ సంపూర్ణమైన బాధ్యతను వహించుటకు తాత్కాలికముగా యిండియాలో ప్రజాప్రభుత్వము నేర్పరుచుటలో కాంగ్రెసువారితో కలసి పనిచేయుటకు తాము సిద్ధముగా వున్నామని ముస్లింలీగువారు చెంటనే మిక్కిలి స్పష్టముగా ఒక ప్రకటనను చెయ్యవలెను!

ఇప్పుడు దేశములో కలిగిన అరాజకస్థితి వెంటనే తగ్గిపోవుటకు ముస్లిములీగువారత్యధికమైన దేశాభిమానముతో మిక్కిలి చురుకుగా పనిచెయ్యవలెను. ఈ ప్రభుత్వ సంఘములో సభ్యులుగావుండదగిన ముస్లిమునాయకులను ముస్లిములీగువారు వెంటనే యెన్నుకొనవలెను. కాంగ్రెసువారెంతమందిని యెన్నుకోవలసిన దిన్నీ ముస్లిములీగువారేనిర్ధారణగా తెలుపవలెను. ఈ సీక్రెటును ఆమోదించవలెను దీనిని వెంటనే అమలులో పెట్టవలెను అని ముస్లింలీగువారు బ్రిటిషు దొరతనమువారి నడుగవలెను. అందుకు దొరతనమువారుగాని, కాంగ్రెసువారుగాని అంగీకరించనియెడల ఆ నిందకు వారే పాత్రులవుతారు. ముస్లింలీగువారిప్పుడి కార్యభారమునంతను వహించిన యపల లీగువారికి ప్రపంచములో అత్యధికమైన కీర్తిలభిస్తుంది. అభిప్రాయభేదాలన్నీ తొలగిపోతాయి. ఇండియాకు సంపూర్ణ స్వాతంత్ర్యము లభిస్తుంది.

వార్తల ప్రచురణ

విషయమై నిరోధములు

ఇండియా ప్రభుత్వం
ఉత్తరువులపై సింహళం
పత్రిక విమర్శ

సింహళములోని సిలోను డెయిలీ న్యూసు పత్రిక, 'భారతదేశపువార్తల నిరోధించుట' యను శీర్షికను యీక్రిందిరీతిగా వ్రాసెను:-

అఖిలభారతకాంగ్రెసుకమిటీవారు అనుమతించిన సమష్టి శాసనోల్లంఘనమునకు సంబంధించిన నిజస్వరూపమును గూడ పత్రికలలో ప్రకటించు విషయమై ఇండియా గవర్నమెంటువారు కొన్ని నిషేధములనుకల్పించిరి. ఈ విధంగా గవర్నమెంటువారు వ్యవహరించడం, చాలా మతి చలించినరీతిగా సూచించుచున్నది. అందువల్ల ఎక్కువ దారుణమైన కష్టనష్టములు సంభవింపగలవు. యుద్ధ సమయంలో వార్తల నన్నింటిని సాకల్యంగా గవర్నమెంటువారు ప్రకటిస్తున్నారు. ఆ పద్ధతినే యీ ఉద్యమవిషయంలో కూడా అవలంబించవలెను. ఇండియా గవర్నమెంటువారి వల్ల ఏ విధమైన తప్పుగాని దోషంగాని లేనియెడల, ఉపన్యాసములనున్నూ, జరిగినవిషయములను ప్రకటించుటవల్ల కలిగేనష్టం ఏమీ ఉండదు. వార్తలను కప్పిపుచ్చుటవల్లనే వదంతులు ఎక్కువవుతాయి. నిజం ప్రకటించుటవల్ల కలిగే హానికంటె, అతిశయోక్తులతో కూడిన అసత్య ప్రచారములవల్ల హాని ఎక్కువగా నుండును. పత్రికలలో వార్తలు ప్రకటింపకబడకపోయినను, రేడియోలో వెల్లడింపబడుచుండును. బొంబాయిలో జనుల గుంపుమీద తుపాకులు కాల్చబడెనని బ్రిటిషు బ్రాడ్‌కాస్టు రేడియోలో ఆదివారంరాత్రి ప్రకటింపబడెను. ఈవార్త నిన్నటి ఉదయంకూడా బ్రిటిషు రేడియోలో తిరిగి చెప్పబడెను. కాని సింహళంలోని పత్రికలకు యీవార్త యింతవరకూ రాలేదు. దూరదేశంలో ఉన్నవారికి రేడియోద్వారా ఇండియాలోని అరెస్టులను గూర్చియు ఇండియాలో జరిగిన అల్లరులను గూర్చియు తెలియుచున్నది కాని, అలహాబాదులో జరిగిన కాంగ్రెసు వర్కింగు కమిటీ సభలో జరిగిన చర్చలయందు మాట్లాడుకోబడినవిషయములు నమోదుచేయబడినకొన్ని చిత్తు ముసాయిదా నోట్లు కాగితాలు ఇటీవల ఇండియా గవర్నమెంటువారిచే ప్రకటింపబడెను. ఆ కాగితాలలోని విషయాలు కాంగ్రెసు నాయకుల అభిప్రాయములను నిరూపించుటలేదు. కాని యిటువంటి చర్యలవల్ల ఇండియా గవర్నమెంటువారి ప్రతిష్ఠ హెచ్చబడదు.

సప్రూగారి ఢిల్లీప్రయాణము

ఢిల్లీ, ఆగస్టు 15:—

సర్ తేజ్ బహాదరు సప్రూగారు రెండు దినములలో ఢిల్లీకి వెళ్లెదరనియు, రాజప్రతినిధితో సంభాషించెదరనియు బి. బి. సి. ఢిల్లీ ప్రతినిధి తెలుపుచున్నాడు.

ప్రభుత్వంవారి కఠినవిధానం

(*)

యుద్ధకార్యాలకు నిరోధంకలుగుతుంది

శ్రీ గోపాలరెడ్డిగారి ప్రకటన

నెల్లూరు, ఆగస్టు 14:—

మదరాసు మాజీమంత్రి బెజవాడగోపాలరెడ్డిగారు కిలానువక ప్రకటన చేశారు.

"కాంగ్రెసువారిమీద కలిగిన కోపమువల్ల దొరతనమువారు తమ ముక్కుసూటిమీదే కోసుకుంటున్నారు. అఖిలభారతకాంగ్రెసునాయకులను రాష్ట్రీయకాంగ్రెసు నాయకులను యావన్మందినికూడా అరెస్టు చేస్తున్నారు. దేశమందంతటా అనేకస్థలాలలో పోలీసువారు ప్రజలసంఘములమీద తుపాకులను కాలుస్తున్నారు. ఇందువల్ల దేశములో యుద్ధకార్యాలు చురుకుగా జరుగుటకు నిరోధము కలుగుతుంది. ఇండియాకు స్వాతంత్ర్యము లభించకపోవుటవలన ప్రజలకు ఆగ్రహము ఇంకా చాలా అధికమవుతుంది. దేశములో యుద్ధకార్యములు విస్తారంగా జరుగుటకిది ప్రతిబంధకమవుతుందేగాని సహాయకముకాదు.

కాంగ్రెసు కోరిక

బర్మామొదలైన దేశాలలో బ్రిటనుదొరతనమువారవలంబించిన యుద్ధవిధానమువిఫలమయింది గనుక యిండియాలో మరియొక యుద్ధవిధానము నవలంబించవలెను. దేశీయులందరుకూడా యుద్ధములో పాల్గొనవలెను. శత్రువులను పారద్రోలుటలో ప్రజలందరు సర్వశక్తులను వుపయోగించవలెను- అని కాంగ్రెసువారు కోరారు.

దొరతనమువారికిప్పుడుకూడా భారతీయులమీద అవిశ్వాసము తొలగలేదు. వారిప్పుడు తమ కఠిన విధానమునుకూడా మిక్కిలి తీవ్రముగా అమలులో పెట్టారు. అందువల్ల ప్రజలలో ఆగ్రహము చాలా అధికమయింది. శత్రువుల సేనలు ఇండియా సరిహద్దులలో వున్నాయి గనుక యిప్పుడు ఇండియాకు స్వాతంత్ర్యము నిచ్చుటకు వీలులేదని దొరతనమువారన్నారు. శత్రుసేనలు సమీపములో వున్నాయి గనుకనే వెంటనే యిండియాకు స్వాతంత్ర్యము నియ్యవలెను. అప్పుడు భారతీయులు శత్రువులను తరిమివేయ గలగడమే కాకుండా యితర దేశాలకు మళ్లీ స్వాతంత్ర్యము లభించేలాగు చేయుటలో కూడా భారతీయులు మిత్రమండలికి సహాయము కూడా చేస్తారని కాంగ్రెసు చెప్పుచున్నది,

ఇప్పుడే స్వాతంత్ర్యము

యుద్ధము ముగిసినతరువాత యిండియాకు సంపూర్ణస్వాతంత్ర్యమియ్యబడు నని బ్రిటను దొరతనమువారిదివరికే ప్రకటించారు. దానిని ప్పుడే యెందుకియ్యగూడదు? రెండేళ్లు ముందుగానే స్వాతంత్ర్యము నిస్తే వారికి కలిగేనష్టమేమున్నది? ప్రజలకు ఆగ్రహము చాలా అధికమైన పిమ్మట వారు దేశానికి స్వాతంత్ర్యము నిచ్చినయెడల దాని వల్ల వారి ఉదారభావము వల్లడికాదు. యుద్ధములో భారతీయులందరు కూడా మిత్రమండలికి మనఃపూర్వకముగాను అత్యధికముగాను సహాయము చేయుటకు తగిన పద్ధతిని దొరతనమువా లవలంబించుట లేదు. ఇండియాకు స్వాతంత్ర్యము నియ్యడము బ్రిటనుదొరతనమువారి కిష్టము లేకపోతే వారాలాగే స్పష్టముగా యెందుకు చెప్పగూడదు? తప్పకుండా యిస్తామని వారెందుకు చెప్పవలెను? రేపియ్యవలసిన దానినినేడేయిస్తే ఎంతసరసంగా వుంటుంది? ప్రజల కర్తృత్వికమైన సంతృప్తి కలుగుతుంది. వారధికోత్సాహముతో యుద్ధములో సహాయము చేస్తారు.

బొంబయితీర్మానంలోనిముఖ్యాంశాలు

బొంబాయి తీర్మానములవల్ల అందరికీ అన్ని సంశయములు కూడా తొలగిపోవుట నిశ్చయము.

దేశంలోని సామాన్యప్రజల ప్రతినిధులే దేశమును పరిపాలిస్తారు గాని, కాంగ్రెసు పార్టివారొక్కరు మాత్రమే పరిపాలించరు. ప్రభుత్వసంఘములో ముఖ్యములైన అన్ని పార్టీల ప్రతినిధులున్ను వుంటారు. ప్రజలందరు ఆయుధములను ధరించియే శత్రువులతో యుద్ధముచేస్తారు కూడా యీ తీర్మానములో స్పష్టముగావున్నది. యుద్ధము ముగిసేవరకు రాజప్రతినిధిన్ని గవర్నరులున్ను యిండియాలో వుంటారు. హైకోర్టులు బ్రిటిషైన్యములు మొదలైనవన్నీ కూడా వుంటాయి. తాత్కాలిక ప్రభుత్వములవారు ప్రత్యేకముగా జపానువారితో సంధిచేసుకోరు అని కూడా యీతీర్మానములో స్పష్టముగా వుంది. ప్రభుత్వాధికారమును భారతీయులకు వశపరిచిన వెంటనే భారతజాతీయ ప్రభుత్వము జపాను జర్మనీ దేశాలమీద యుద్ధమును ప్రకటిస్తారు. ఈ రెండు పక్షములున్నూ యేకకాలములోనే జరుగవలెను.

ప్రభుత్వంవారి బ్లిట్జ్ పద్ధతి

రాయబారాల విజయానికి నాయకుల విడుదల అవసరం

శ్రీ కాళప్పగారి ప్రకటన

నాగపూరు, ఆగస్టు 14:—

మధ్యరాష్ట్రముల కాంగ్రెసు అసెంబ్లీ పార్టీకార్యదర్శియైన వి. వి. ఆర్. కాలప్పగారు (ఇతడు జెనుక భారత ప్రేడుయూనియను కాంగ్రెసుకు అధ్యక్షుడుగా వుండెను.) యీలాగు చెప్పారు.

"కాంగ్రెసువారు శాసనోల్లంఘనమును విరమించినయడల కాంగ్రెసువారితో రాయబారములను జరుపుతామని బ్రిటను దొరతనమువారు ప్రకటించవలెను"అని బ్రిటిషు కార్మికపక్షమువారు ప్రకటించారు. ఈసారి బ్రిటనుదొరతనమువారి అనుమతితో ఇండియాదొరతనమువారే ముందుగా కాంగ్రెసువారితో పోరాటమును ప్రారంభించారు. కాంగ్రెసు 52 దేశీయులనుంచి దేశములో స్వరాజ్యముకొరకు పనిచేస్తువున్నది. దేశములో కాంగ్రెసుపార్టీలాగే వున్నంతమంది సభ్యులు మరే పార్టీలోను కూడాలేరు. ఇటువంటి కాంగ్రెసుకు చేరిన సంఘము లన్నీకూడా అక్రమసంఘములే అని దొరతనంవారు 8 వ తేదీ రాత్రి వక్క కలకుపోటుతో ప్రకటించారు. నాయకులనందరిని అరెస్టుచేసారు. యుద్ధములో ఆకస్మికముగా వక్క పెట్టున శత్రువులపైని గవియుట అనేపద్ధతి వకటివున్నది. దీనిని బ్లిట్జు యుద్ధపద్ధతి అని యుద్ధవిద్యలో నిపుణులైన వారంటారు. ఇప్పుడు దొరతనము వారీపద్ధతినే అవలంబించారు. గనక దొరతనంవారే ముందుగా గాంధిమహాత్ముడు మొదలైన కాంగ్రెసునాయకుల నందరిని వదలవలెను. వీరి నందరిని వదిలితేగాని దేశంలో శాంతి నెలకొనదు. దేశంలో శాంతి యేర్పడితేగాని రాయబారాలవల్ల అనుకూలమైన ఫలితము కలుగదు. (అ. ప్రె.)

ఇండియా కేంద్ర ప్రభుత్వోద్యోగులఅల్లవెన్సులు

ఢిల్లీ, ఆగస్టు 14:—

కేంద్ర ప్రభుత్వమునకు చెందిన ప్రభుత్వోద్యోగులకు సేవకులకు యుద్ధకాలంలో వస్తువుల వెలలు హెచ్చిన కారణమువల్ల యీ క్రిందిరీతిగా అలవెన్సులు యివ్వబడును. 1942 ఆగస్టు 1 తేదీ నుండియు లెక్కించి అలవెన్సు యివ్వబడును.

భారతదేశము మూడు తరగతుల ప్రాంతముగా విభజించబడినది. (ఏ) ప్రాంతం, (బి) ప్రాంతం, (సి) ప్రాంతం.

(ఏ) ప్రాంతంలో కలకత్తా బొంబాయి నగరములున్నూ వాని చుట్టుప్రక్క ప్రదేశములున్నూ చేరియున్నవి.

(బి) తరగతి ప్రాంతంలో యీ క్రింది పట్టణములు చేరియున్నవి. అబ్బాటాబాదు, ఆగ్రా, అహమ్మదాబాదు, అలహాబాదు, అమృతసరు, బెంగుళూరు, బెనారసు, కాన్పూరు, ఢాక్కా, డార్జీలింగు, డేరాదూను, ఢిల్లీ, ధనుష్కోటి, హైదరాబాదు(నైజాం),కరాచీ,లాహోరు, లక్నో, మద్రాసు, మీరటు, మసూరీ, నాగపూరు, నైనిటాలు, ఊటకమండలం, పాట్నా, పెషావరు, పూనా, క్వెట్టా, రాంచీ, రావల్పిండి, షిల్లాంగు, సిమ్లా.

(సి) ప్రాంతంలోను (బి) ప్రాంతంలోను చేరనటువంటి ప్రాంతములన్నియు (సి) ప్రాంతములో చేరినవైయున్నవి.

రూ 39 లున్నూ అంతకు తక్కువయున్నూ జీతంగలవారికి (ఏ) ప్రాంతంలో రూ 6 లు (బి) ప్రాంతంలో రూ 5 లు (సి) ప్రాంతంలో రూ 4 లు అలవెన్సు ఇవ్వబడును.

రూ 39 మించి రూ 100 మించకుండా జీతం తీసికొనేవారికి (ఏ) ప్రాంతంలో రూ 9 యివ్వబడును.

39 మొదలు రూ 80 వరకు జీతాలు కలవారికి (బి) ప్రాంతంలో రూ 7 యివ్వబడును.

రూ 39 రూ 60 మధ్య జీతముగలవారికి (సి) ప్రాంతంలో రూ 6 అలవెన్సు యివ్వబడును.

రూ 108 ల వరకున్నూ రూ 86 ల వరకున్నూ రూ 65 ల వరకున్నూ జీతాలు గలవారికి (ఏ) ప్రాంతంలోను (బి) ప్రాంతంలోను (సి) ప్రాంతంలోను వారివారికి తగిన అలవెన్సులు యివ్వబడును. రూ 100 లు జీతం గాని, రూ 80 లు జీతం గాని, రూ 60 లు జీతంగాని తీసికొనేవారికంటె పైజెప్పినవారి అలవెన్సులు హీనంగా ఉండకుండా చూడబడును. (అ. ప్రె.)

ఇటువంటి పరిస్థితులలో ఇండియా దొరతనమువారు కఠిన విధానము నమలుజరుపుట మిక్కిలి అనుచితము. కఠిన విధానమువల్ల ప్రజల మనస్సులలో క్రోధద్వేషాలు చాలా అధికమవుతాయి. వారు యుద్ధములో మనఃపూర్వకముగా సహాయముచేయుటకు కూడా దీనివల్ల అభ్యంతరము కలుగుతుంది. వారి యుద్ధవిధానమునకున్ను, యుద్ధసామాగ్రికున్ను కూడా కఠిన విధానము ప్రతిబంధకమే అవుతుంది.

మదరాసు ధరలు

మద్రాసు, ఆగస్టు 51:—

చక్కెర

చెన్ పాతియా ౧ 37-11-9

స్వదేశి మిల్లునూలు

జపాను పట్టువలె కనబడునూలు

(౫ పౌనుల కట్ట)	రు. అ. పై.
64/2 నిప్పాన్ చలవరకం	18-8-0
64/2 కనగ చలవరకం	స్టాకులేదు
84/2 నిప్పాన్ చలవరకం	—

జపాను రెయాన్ నూలు (సింగిలు)

(10 పౌనుల కట్ట)	150 (ఏ)
ఫూజి 37-8-0 (150 నెం. 1)	జోతి 38-8-0
2/150 స్టార్ ఎలిఫెంటు (10 పౌనుష్టు)	46-0-0
2/120 సెమలి	స్టాకులేదు
2/120 స్టార్ ఎలిఫెంటు	,,

జపాను రెయాన్ నూలు (డబుల్సు)

మధురమిల్లు నూలు 20 నెం. (10 పౌనులకట్ట) బూడిదెరంగు	10-6-0
40 నెం. (5 పౌ॥కట్ట) బూడిదరంగు	8-2-6
60 నెం (5పౌనులు) బూడిదెరంగు	13-0-0
80 నెం (5 పౌనులు)	16-10-0

(కోయంబత్తూరు మిల్లునూలు)

మదరాసు ధరలు

20½ కంబోడియా (10 పౌ॥ కట్ట)	10-4-0
40 నెం రంగనిలాస్ (10 పౌ)	15-14-0
40 నెం కామధేను (10 పౌను)	15-14-0
60 నెం పయనీరు (5 పౌ)	13-0-0
60 నెం కొత్తారి	12-15-0
60 నెం రంగవిలాస్ (5 పౌ)	12-12-0
80 నెం. పయనీరు (5 పౌనులు)	17-12-0
80 నెం.	17-4-0
100 నెం. పయనీరు ,,	25-4-0
,, ఇతర రకాలు ,,	24-0-0
28 నెం (10 పౌ)	13-1-0
32 నెం ,,	13-4-0
30 నెం ,,	13-8-0

రైళ్ల రాకపోకలు

సెంట్రల్ యం. యస్. యం. రైల్వే

బండ్లపేరు	బయలుదేరువేళ	వచ్చువేళ
కలకత్తా మెయిలు	సా. 5 15	ఉ. 8 20
గ్రాండుట్రంకుఎక్స్‌ప్రెస్	ఉ.7 30	రా 7 15
పూరీ ప్యాసింజరు	రా. 7 55	ఉ. 11 45
వాల్తేరు స్యాసింజరు	ఉ. 8 45	రా. 7 5
బొంబాయి మెయిలు	సా. 6 40	ఉ. 6 5
,, ఎక్స్‌ప్రెస్	ఉ. 7 40	సా 6 10
రాయిచూరుప్యాసింజరు	ఉ. 9 25	సా. 4 20
రేణిగుంట ప్యాసింజరు	—	ఉ. 9 45
బెంగ్లూరు మెయిలు	రా. 9 0	ఉ. 6 20
బెంగ్లూరు ఎక్స్‌ప్రెస్	మ. 12 15	మ. 2 45
బెంగ్లూరు ప్యాసింజరు	ఉ. 6 0	రా. 8 50
బెంగ్లూరు ప్యాసింజరు	రా. 9 10	ఉ. 5 45
జోలార్పేటప్యాసింజరు	మ. 12 30	మ. 2 25
అరక్కోణం కాట్పాడి ప్యాసింజరు	సా. 5 30	—

యస్. ఐ. రైల్వే సెంట్రల్

నీలగిరి ఎక్స్‌ప్రెస్	రా. 8 15	ఉ. 6 35
మలబార్ ఎక్స్‌ప్రెస్	రా. 7 10	ఉ. 7 15

ఎగ్మూరు

ఇండోసీలోనుఎక్స్‌ప్రెస్	రా. 8 15	ఉ.7 40
మెట్రోటుప్యాసింజరు	ఉ. 6 20	రా. 7 25
తిరువేంద్రం ఫో॥ప్యా॥	రా. 8 45	ఉ. 6 45

కాస్డులైను

తిరుచినాపల్లి ఎక్స్‌ప్రెస్	రా. 10 5	—
తిరుచినాపల్లి ఫో॥ ప్యా॥	—	సా. 4 0
తిరువేంద్రంఎక్స్‌ప్రెస్	రా. 7 30	ఉ. 7 5
ధనుష్కోటి ఫో॥ప్యా॥	ఉ. 10 15	మ. —
ధనుష్కోటి ఎక్స్‌ప్రెస్	ఉ. 8 20	—

బీచి

కంజీవరం ప్యాసింజరు	సా. 6 2	ఉ. 9 24

తిరుపతిలో గొప్ప ఇంట వివాహము

తిరుపతి, ఆగస్టు 14:—

తిరుపతి డిస్ట్రిక్టు మునసబు శ్రీ. జి. కృష్ణమూర్తి తమ కొమార్తె సౌ॥ సుందరి అను కన్యకను,మద్రాసునివాసియు హైకోర్టు అడ్వకేటునగు శ్రీ. వి. రాధా కృష్ణయ్యగారి ద్వితీయకొమారుడు చి. వి. నట రాజన్ అడ్వకేటునకిచ్చి పాణిగ్రహణ మహోత్సవమును తిరుపతిలో నిన్నటిరోజు నడపితిరి. నగరములోని ప్రముఖులందరు వివాహమునకు వచ్చిరి. దంపతులను ఆశీర్వదించుచు మద్రాసు హైకోర్టు జడ్జీలు శ్రీ. దరు సర్. యం. వెంకటసుబ్బరావుగారు మరి కొంతమంది ప్రముఖులు సందేశములు పంపిరి. (స్వ. వి.)

కలకత్తా మెయిలు నిన్నరాత్రి మద్రాసు చేరినది

మార్గంలో పరిస్థితుల వివరాలు

మన్నారుగుడి స్టేషను తగులబెట్టబడుట

మదరాసు, ఆగస్టు 16:—

నిన్న ఉదయము చెన్నపురికి రావలసిన కలకత్తా మెయిలు 12 గంటలసేపు ఆలస్యముగా మామూలు మార్గమునే రాత్రి 7 గంటలపుడు చెన్నపురికిచేరెను. కలకత్తా మెయిలు పూరీ ప్యాసింజరుబండ్లు నిన్న సాయంత్రం సహజంగా బయలుదేరుసమయమున బయలుదేరి వచ్చెను. మనకు తెలిసినట్లు అవి రాత్రికి బిట్రగుంటలో ఆగి తరువాత పగటిపూటనే వస్తాయి. ఈవారం ఉదయం మదరాసునుండి బయలుదేరు గ్రాండు ట్రంకు ఎక్స్‌ప్రెసుమాత్రం రాయమాట మీదుగానే వస్తుంది.

ప్రత్యేకబందోబస్తు

అల్లకల్లోలం జరిగినప్రాంతాలలో రైలు మార్గం రక్షించుటానికి ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లుగావింపబడియున్నవి. ప్రతిబండిలో సాయుధ రక్షకులు పంపబడుచున్నారు.

సైనికులతో నొక స్పెషలు రైలు నిన్న మధ్యాహ్నం సెంట్రలు స్టేషనునుండి లెనాలికి వెళ్లెను.

బంగోలు, బెజవాడ స్టేషనులమధ్య టెలిగ్రాపు తంతి సంబంధాలు యింకా సరిగా లేవు.

దక్షిణ ఇండియా రైలుమార్గము

యస్. ఐ. రైల్వే సమష్టి రైలు తిరుప్పూరు నుండి నిన్న ఉదయము చెన్నపురికి వచ్చెను. శింగనల్లూరు వద్ద నొక గూడ్సు రైలు పట్టాలు తొలగి క్రిందపడిన కారణమున కలిగిన ఆటంకం యీరోజున తొలగించబడునని ఎంచబడుచున్నది. రైల్వే అధికారులు నేటి సాయంత్రం నుండి బండ్లు సరాసరిగా నడుచునని ఆశించుచున్నారు.

మన్నారుగుడి స్టేషను తగులబెట్టుట

తంజావూరు జిల్లాలో యస్. ఐ. రైల్వే మీద నున్న మన్నారుగుడి స్టేషనుపై జన సమూహము పడి స్టేషను భవనానికి నిప్పుపెట్టినట్లు వార్తలు అందెను. అప్పుడే ఆ స్టేషనుకు వచ్చియుండిన నొక రైలుబండిని మనుకకు నడిపించాలని బండి నడిపేవారితో జనసమూహంలోని వారు చెప్పారనియు, తదనుగుణ్యంగా బండి నీడామంగలమునకు తిరిగి మనుకకు నడుపబడెననియు తెలుస్తున్నది. టెలిగ్రాపు టెలిఫోను తీగలు కూడా ఛేదింపబడెను.

ప్రయాణికులు తెలిపిన వివరాలు

బెజవాడనుండి నిన్న రాత్రి కలకత్తా మెయిలులో వచ్చిన ప్రయాణీకులు నిడుబ్రోలువద్ద ఒక ఇంజను యింకా బోరగిలపడియున్నదనిన్నీ, ఆ స్థలమున రైలు వేరొక మార్గమున వచ్చినదనిన్నీ తెలిపిరి.

దుగ్గిరాల, తెనాలి, నిడుబ్రోలు, చీరాల స్టేషనులు శిథిలమైయున్నాయనిన్నీ, తెనాలి గూడ్సుషెడ్డు పూర్తిగా రూపు తెలియక నాశమైయున్నదనిన్నీ తెలుపబడెను.

మార్గమున అనేక చోట్ల టెలిగ్రాపు టెలిఫోను తీగెలు స్థంభాలనుండి వ్రేలాడుచున్నవి. కలకత్తా మెయిలు బెజవాడను వదలినరువాత చీరాల వరకు మెల్లగా నడిపింపబడెననియు అటు పిరువాత డ్రైవరు బండిని కొంత వేగముతో నడపటానికి సాహసించెననియు తెలిసి తెనాలిస్టేషనులో కొన్ని కాలిపోయిన టపాసంచులు కూడా పడియుండినట్లు ప్రయాణీకులు చెప్పిరి.

నీటారు గేజిలో గుంటూరు నంబూరు స్టేషనులమధ్య రైలుపట్టాలు తంతి తీగెలు చేదింపబడెననియు దక్షిణనెల్లూరు వేదయపాళెం మధ్యకూడా తంతితీగెలు తెగగొట్టబడెననియు తెలుస్తున్నది.

సిడియాత్రం వానియంబాడి స్టేషనుల మధ్యకూడా తంతి తీగెలు తెగగొట్టబడెను. కాని వెంటనే మరమతు చేయబడెను.

ఎగ్మూరుకు రైలుబండ్లు ఆలస్యముగా వచ్చుట

ఇండోసింహళం ఎక్స్‌ప్రెసు ధనుష్కోడి ఎక్స్‌ప్రెసుబండ్లు మార్గమున మెల్లగా వచ్చుటచే నిన్న ఉదయం ఎగ్మూరుకు దాదాపు రెండుగంటలసేపు ఆలస్యముగా వచ్చెను.

మంచి రక్తశుద్ధికారి యిదిగో!



మేహము, గనేరియా, బ్లయికోరియా, వాతరోగము, కీళ్లవాతము, నాడీవ్యాధి, కురుపులు, వ్రణములు, గజ్జి, చర్మవ్యాధులు, మలేరియా, రక్తపుపోటు మొదలగునవి పూర్తిగా నివారింపబడగలవని శారిబాది సార్సా బుజువుచేసి యుండగా వాటివల్ల బాధపడు టెందులకు?

శారిబాది సార్సా రక్తములోని విషక్రిములను, విషములను పోగొట్టును, సుఖవిరేచనమగునట్లు చేయును. శాలేయముసక్రమముగా పనిజేయునట్లు సలుపును. రక్తమును వృద్ధిజేయును. గొప్ప బలవర్ధకమైన గుణములు కలిగి శాస్త్రయుక్తముగా తయారుచేయబడిన ఔషధము. పెద్ద బుడ్డి 1-కి అణాలు 12.

అధ్యక్షు-డాక్టర్ జోగేన్‌చంద్రఘోష్, ఎం. ఏ. ఆయుర్వేదశాస్త్రి, ఎఫ్. సి. ఎస్. (లండన్) ఎం. సి. ఎస్. (అమెరికా) లోగడ భగల్పూర్‌కళాశాలలో రసాయన శాస్త్రోపాధ్యాయులు.

ఉచితమగు దోమగనిర్ణయమునకు, క్యాటలాగుకు పూర్తి వివరములతో వ్రాసుకొనుడు.

సాధనసౌందర్యశక్తి

శుద్ధమైన అసలు ఆయుర్వేదౌషధములు తయారుచేయువారు. ఇండియాలోను విదేశములలోను అంతట బ్రాంచీలు యేజన్సీలు కలవు.

17-ఏ, బ్రాడ

WANTED

WANTED 250 CANDIDATES FOR Railway Services as Station Masters, Guards, Signallers, Ticket-collectors, Free quarter. Railway fare paid. Scholarship Rs. 80. Apply with 0-1-6 to Director, All-India Railway Commercial & Telegraph School. Daryagunj, Delhi.

అక్షరసాయువాబ్ధ, ముత్యాల.

ఆయుర్వేదౌషధములకు నిలయం

గాలియాత గ్రంథకర్తగారి

యోగచూర్ణము

(బలవర్ధక ఆహారము)

నేను గాలిలో యీరుటను అభ్యసించుకాలములో ఒకొక్కప్పుడు పాలు, పెరుగు, వెన్న, మీగడ, నెయ్యి మొదలగు పోషకపదార్థములు దొరకక పోవుచుండేవి. అట్టితరి గలగు బాధను నివారించుటకై ఆయుర్వేద, ప్రకృతి, యోగశాస్త్రాలను సారముగా నొక చూర్ణమును తయారుచేసి వాడుకొనుచుంటిని. ఇందువలన పై పాలు వగైరా పదార్థములు తగ్గినను బాధ లేకుండెను. దేహము చల్లగా నుండుచుండెను. అత్యధికపోషక పదార్థములను అతిస్వల్ప ప్రమాణములో ఇమిడ్చిన ఒక ఆహారవిశేషము. ఇది మందు గాదు. మంచి జీర్ణశక్తిగలవారు నాల్గురోజులు పూటకు ఆరతులను చొప్పున నాలుగు తులములు దీనిని పుచ్చుకొనుచో ఆకలి మందగించి పోవును. దీనినిబట్టియే దీని పోషకత్వమును తెలుసుకొనవచ్చును. పప్పు, పెరుగు, నెయ్యి, గడ్డకూరలు, పాయసము, హల్వా, లడ్డు, మైసూరుపాకు, జిలేబి, మినపసున్ని వగైరాలను విశేషముగా వాడినచో గురుత్వము చేయుటలేదా? ఈ యోగచూర్ణము సేవించుటచే అత్యుష్ణముపల్ల కలిగిన అజీర్ణము, మలబద్ధకము, గుండె బలహీనత, వగైరాలు నయమగును. అతిమూత్రము, మధుమేహము, మేహవాతము, (రక్తపుపోటు) శీఘ్రస్ఖలనము, శుక్లనష్టము, గనేరియా, పుట్టుకార కము, వరముల బలహీనత, చిక్కిపోవుట, ఋతురక్తము జారికాకుండుట, అధికముగా అగుట, ఋతుకాలపునొప్పి, తెలుపు, యెరుపు కుసుమవ్యాధి, మొదలగు స్త్రీవ్యాధులు నివర్తించును. సమస్త మేహవ్యాధులలోను, పిత్తవ్యాధులలోను అద్భుతముగా పనిచేయును. ఉష్ణతత్వముగలవారికి సంజీవి బలము, శాంతి, వీర్యవృద్ధి ఇత్యాదులు లభించును. 40 రోజులకు 10 తులముల డబ్బారు. 2-8-0, పోస్టేజి 7 అణాలు.

సుప్రసిద్ధనటీమణి కొమ్మారి పద్మావతీ దేవిగారు ఇట్లు వ్రాయుచున్నారు.

"మీ ఔషధంవల్ల మా కుటుంబానికి చాలా సుఖశాంతులు కలిగినై. ఇదివరకు పున్న జబ్బులు పోయాయి." —పద్మావతి.

గాలియాత సర్ రాధాకృష్ణన్ ప్రభృతులు కొనియాడిన గ్రంథరాజము. వెల రు. 1, పోస్టేజి 4 అణాలు.

దీర్ఘవ్యాధులకు సులభమైన యోగపద్ధతులు ఉపదేశింపబడును.

ఆంధ్రపత్రికాసంపాదకుల కలముసుండి.

మాకు నా కుపదేశించిన ప్రాణాయామములవల్ల చాలకాలమునుండి వున్న రక్తపుపోటు, తలనొప్పి క్షణములలోనే తగ్గిపోయెను. —చల్లా జగన్నాథం.

శేషభట్టర్ వీరరాఘవాచార్యులు, యోగమఠము, ఇలింద్రవారివీధి, బంగోలు.

వెంకట్రావు అరెస్టు

(1-వ పేజీ తరువాయి)

కలని 7 గురున్ను చిత్తూరు డిప్యూటీ మాజిస్ట్రేటుగారిచే విచారింపబడిరి.

ప్రాసిక్యూషన్ పరఫున పోలీసువారున్ను ముద్దాయిల పక్షమున సుమారు 10 మంది విద్యార్థులున్ను సాక్ష్యమునిచ్చిరి.

ప్రాసిక్యూషనుకు ప్రాసిక్యూటింగ్ ఇన్‌స్పెక్టరువారు వాదించిరి. ముద్దాయిల పరమున వకీలు డి. శ్రీనివాస అయ్యంగారు వాదించిరి.

ఉభయవాదనలున్ను విని మాజిస్ట్రేటుగారు 7 గురులో విశ్వనాథమునువారిని వదలివేసిరి. మువ్వురు విద్యార్థులకు ప్రతియొకని కిన్ని 1 నెలచొప్పున శిక్షనున్ను, విద్యార్థులుకాని ఇద్దరకు 3 నెలలు శిక్షనున్ను విధించిరి.

విద్యార్థికాని మరియొకరు మంచినీటివడికకు 100 రూపాలకు, జామీనిచ్చినందున వదలివేయబడిరి.

శ్రీ టి. కే. టి. తాతాచారిగారి అరెస్టు

చిత్తూరు, ఆగస్టు 15:—

ఈదినము మధ్యాహ్నము 1 ఘంటకు ఇండియా డిఫెన్సు 129 రూలుక్రింద అరెస్టు చేయబడి వేలూరు కారాగృహములో డిటెన్యూగా నుంచుటకు 2 ఘంటల రైలులో కొనిపోబడిరి. (స్వ. వి.)

తిరువతిలో అరెస్టులు

తిరుపతి, ఆగస్టు 15:—

నిన్నటిదినం రుపన్యాసము లిచ్చిన శ్రీ బి. శంకరయ్యనాయుడు (తిరుపతి కాంగ్రెసు కమిటీ ప్రసిడెంటు) అంతరపురం కాలేజి విద్యార్థి శ్రీ సి. ఆదిశేషయ్యశెట్టి, రాత్రి 12 ఘంటలప్పుడు డిఫెన్సు చట్టముక్రింద అరెస్టుకాబడిరి. నేటిదినం సబ్‌కలెక్టరువారలకు 24-8-42 వరకు రిమాండిచ్చిరి. వీరిరువురు తిరుపతి సబ్‌జైలులో నుంచెదరు.

తిరుపతి దేవస్థానం హైస్కూలులో 9 వ తరగతివరకు చదివి మానుకొన్న శ్రీ కందప్ప అను యువకుడు నేటిదినం తిరుపతి నగరవీధులలో స్లోగన్లు పాడుచుండగా పోలీసువారు అరెస్టుచేసి పోలీసుస్టేషనుకు పిలుచుకొనిపోయిరి. ఇతను నేటిసాయంకాలంవరకున్నూ పోలీసుస్టేషనులో నుండెను. ఇతనిని జాయింటుమేజిస్ట్రేటు ఎదుట హాజరుపరచెదరని తెలియుచున్నది. (స్వ. వి.)

శ్రీ తెన్నేటి విశ్వనాథంగారి అరెస్టు

విశాఖపట్నం, ఆగస్టు 14:—

మాజీ కాంగ్రెస్ పార్లమెంటరీ కార్యదర్శి శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు బొంబాయి నుండి రాయపూరు ప్యాసింజరులో నిన్న ఉదయం 10-30 గంటలకు విశాఖపట్నం వచ్చిరి. సరిగా 12 గంటలకు స్థానిక సి. ఐ. డి ఇన్‌స్పెక్టరు ఒక పోలీసుతోవచ్చి శ్రీ విశ్వనాథంగారిని వారి గృహమునుండే భారతరక్షణ చట్టముక్రింద అరెస్టుచేసి పోలీసు లారీలో వాల్తేరుస్టేషనుకు తీసికొనివెళ్లి అచటనుండి మదరాసుపోయే మెయిలులో రాయవెల్లూరు జెయిలునందు నిర్బంధముకై తీసికొనిపోయిరి. శ్రీ విశ్వనాథంగారితో స్థానిక కాంగ్రెస్ సభ్యులు ఇన్‌స్పెక్టరున్నూ, ఇద్దరు రిజర్వుపోలీసులున్ను రాయవెల్లూరు వెళ్లిరి.

పోలీసువారు శ్రీ విశ్వనాథంగారి రికార్డు పెట్టి సోదాచేసి కూడ అందులోనున్న రికార్డంతా విశ్వనాథంగారి స్వంత రికార్డులు, అందుచే పోలీసువారు ఎట్టి కాగితములను తీసుకోలేదు.

స్థానిక ఆంధ్రా మెడికల్ కాలేజీ విద్యార్థులలో చాలమంది యీ రోజున కాలేజికి వెళ్లలేదు. మొత్తము విద్యార్థులలో సుమారు 20 మంది మాత్రము హాజరైనట్లు తెలియుచున్నది. (స్వ. వి.)

మాజీ పోలీసుకానిస్టేబిల్ అరెస్టు

తిరుపతి, ఆగస్టు 15:—

శ్రీ యం. వి. రమణన్ (మాజీ పోలీసు కానిస్టేబిల్) నేటిదినం తిరుపతిలో కాంగ్రెసు విషయములను బహిరంగసభలో సాయంకాలం వుపన్యసించుచుండగా పోలీసువారు వెంటనే అరెస్టుచేసి పోలీసుస్టేషనుకు పిలుచుకొనిపోయిరి. (స్వ. వి.)

నరసాపురం

నరసాపురం, ఆగస్టు 14:—

నేటిదినం నరసాపురం స్కూలర్లు బోర్టుపై పోరాంగా సమ్మెకట్టిరి. స్థానిక పాఠశాలల విద్యార్థులకూడ సమ్మెకట్టిరి.

పాలకొల్లు

ఆగస్టు 13:—పాలకొల్లు మ్యునిసిపలు సంఘమువారు నిన్నటిదినం శ్రీ అడ్డేపల్లి సత్యనారాయణ మూర్తిగారి అధ్యక్షతన సమావేశమై నాయకుల నిర్బంధములకు ఆక్షేపమై తెలుపుచు మునిసిపలు పాఠశాలలను 14 వ తేది మూసివేయవలయునని తీర్మానించిరి.

సిగ్నలుతీగలు తెంపబడుట

తెల్లవారుజామున పర్సాపురమునుండి 4 గం॥ రాపలసిన రైలుఒకగంట ఆలస్యముగాను భీమవరమునుండి రావలసిన రైలుకూడా ఆలస్యముగా వచ్చినవి. గోరింటాడ సమీపములోను పీరవారపరము సమీపములోను రైల్వేతాలూకు టెలిఫోనుతీగలు తెగిపోవుటచేతను సిగ్నల్సు పనిచేయనందున రైళ్ళ రాకపోకలకు ఆలస్యమయినదని చెప్పబడినది.

నెల్లూరులో హర్తాళము

నెల్లూరు, ఆగస్టు 12:—

నెల్లూరు పురమున వున్న బాలురు నేడు పాఠశాలలకు పోలేదు. ట్రంకురోడ్డు-స్టోను హౌస్ పేటలలో అంగళ్ల తాళములు తెరవలేదు. బాలురు పాఠశాలనుండి అరచుచు ఉత్సవము జరిపిరి. ఉత్సవము సెంట పోలీసుల లారీ పోవుచుండెను.

గుంటూరు విద్యార్థుల సమ్మె

గుంటూరు, ఆగస్టు 12:—

నిన్న సాయంకాలము గుంటూరు విద్యార్థులు మెయిముందుపైగా, ఒకమైలు పొడుగున ఊరేగింపులతో కాంగ్రెసు జండాలతో, విద్యార్థిసంఘాల జండాలతోను, బయలుదేరి గాంధిపార్కు సాయంకాలము 5 గంటలకు చేరిరి. బహిరంగసభ యేర్పాటుచేయబడెను. శ్రీయుత యం. రాధాకృష్ణ ఎం. ఎ., గారు వుపన్యసించుచు ప్రభుత్వమువారి చర్యలను తీవ్రముగా ఖండించిరి. (స్వ. వి.)

తణుకులో విద్యార్థులసమ్మె

తణుకు, ఆగస్టు 12:—

ఈరోజు హైస్కూలు విద్యార్థులందరును ఉదయం పాఠశాలకు పోవుట మానివేసిరి.

యీవేళ తణుకులోనున్న స్కూలర్లు సభచేసి రాజకీయ నాయకులను నిర్బంధమునుండి విడుదల చేయుచు వెంటనే జాతీయప్రభుత్వము నేర్పరచవలసినదిగా ప్రభుత్వమువారిని కోరుచూ తీర్మానము గావించిరి. (స్వ. వి.)

ధర్మవరం

ధర్మవరం, ఆగస్టు 15:—

నిన్నటిదినం స్థానిక పాఠశాలలో విద్యార్థులు సమ్మె జరిపిరి. సాయంకాలము సంతపైమైదానంలో సభ ఏర్పాటుచేసినదాని పోలీసువారి ఆజ్ఞాంతరమువల్ల సభ జరుగలేదు.

అమలాపురం అడిషనలు పబ్లికు ప్రాసిక్యూటరు రాజీనామా

అమలాపురం, ఆగస్టు 14:—

అమలాపురం అడిషనలు పబ్లికు ప్రాసిక్యూటరు బి. యస్. శాస్త్రిగారు ప్రభుత్వ నిర్బంధవిధానమునకు అసమ్మతిగా తమ ఉద్యోగమునకు రాజీనామా నిచ్చిరి.

ఇచట బోర్డుహైస్కూలు విద్యార్థులు నిన్న సమ్మెచేసి స్కూలుకు పోవుటను మానిరి. (స్వ. వి.)

ఆంధ్రమహాసభ స్థాయిసంఘసభ

బళ్లారి, ఆగస్టు 15:—

ఆంధ్ర మహాసభ స్థాయిసంఘసభ ఆగస్టు 23 వ తేది ఉదయం 8 గంటలకు చిత్తూరులో కాళ్యగర్గసభ్యుల సన్నాహాటకును, భావి కార్యక్రమమును ఆలోచించుటకును జరుగబోవునని యు, అధ్యక్షులు విజయనగరం మహారాజుగారు, జనరల్ విజయరాఘవాచార్యులు గారు అధ్యక్షత వహింపనునని యు, కార్యదర్శి శ్రీ తిరుమల్ల రామచంద్రరావుగారు ప్రకటిస్తున్నారు.

తెనాలిరైల్వేస్టేషన్ ఉదంతము

పూరీ ప్యాసెంజరు బండ్లు తగులబెట్టుట

పోలీసు కాల్పులు – 6 గురి మరణం

గుంటూరు కాల్పుల వివరాలు

(మా విలేఖరుల వద్దనుండి)

తెనాలి, ఆగస్టు 13:—

తెనాలిలో నిన్నటిరోజు వుదయంనుండి గాంధిమహర్షుని, తదితరనాయకుల అరెస్టు సందర్భములో తను అసమ్మతిని తెలియజేయుటకై దుకాణము లన్నియు మూయబడెను. లాలూకాహైస్కూలు విద్యార్థులు బడికిపోవుట మానివేసిరి. కోర్టులు, ఫ్యాక్టరీలు, బ్యాంకులుకూడ మూయబడెను.

స్టేషనుముట్టడి

వుదయం 8 గంటలనుండి ప్రజాసమూహము రయిల్వేస్టేషను పైవుసకు వెళ్లి చదరు స్టేషన్ను ముట్టడించిరి. స్టేషనులోనున్న కిరసనాయిలు డబ్బాలను తీసికొని స్టేషనులోని స్పెన్సరురూముకు నిప్పంటించిరి. స్టేషనులో నున్న రికార్డులను భర్నీచరుఅంతా అగ్నిలో పడవేసి తగులబెట్టిరి. సిగ్నల్సు కాబిన్సువద్ద నున్న తీగెలు లైట్లు, పాయింట్లు అన్నియు విరుగగొట్టబడెను.

పూరీప్యాసెంజరుపై దాడి

తరువాత 9-30 గంటలకు పూరీ ప్యాసెంజరు వచ్చి స్టేషనుకు ఫర్లాంగుదూరములో ఆగిపోయెను. ప్రజాసమూహము సదరు బండిపైపుకు వెళ్లి ప్యాసింజర్లందరిని దిగిపొమ్మని చెప్పి ప్యాసింజరు పెట్టెలకు నిప్పంటించిరి. పార్సిల్సు పెట్టెనుతెరచి అందులోని విలువగల సామానులను పేపరు కట్టలను క్రిందికి పారవేసి దానికి గూడా నిప్పంటించిరి. 5 కంపార్టుమెంటులు సాంతముగా తగులబడినవి.

పోలీసు కాల్పులు

అప్పటికి గుంటూరునుండి జిల్లాకలెక్టరు, జిల్లా సూపరింటెండెంటు రిజర్వుదళముతో వచ్చి నిప్పులను ఆర్పుటకు ప్రయత్నములు గావించిరి. చేరిన ప్రజాసమూహములను చెదరిపోవలసినదిగా ఆజ్ఞాపించిరి. వారు వెళ్లకుండుటచేత లాఠిచార్జీకూడా చేసిరి. దానిపై జనసమూహము కర్రలు రాళ్లు పోలీసువారిపై రువ్వుటచేత పోలీసువారు జనసమూహముపై తుపాకులను కాల్చిరి. పోలీసు కాల్పులవల్ల 17 మందికి గాయములు తగిలి వారిలో 6 గురు మరణించిరి. పోలీసులకు కొద్దిమందికి గాయములు తగిలినవి. స్టేషనులో సామానులను ఎత్తుకొని పోవుచున్నవారిని కొంతమందిని అరెస్టు గావించి సబ్‌జైలులో నుంచిరి.

144 వ సెక్షను ప్రకటన

నిన్నటిదినము నుండి తెనాలిటవును 5 మైళ్ల దూరమువరకు నెలరోజులవరకు 144 సెక్షను జారీచేసిరి.

గుంటూరులో పోలీసు కాల్పులు

గుంటూరు, ఆగస్టు 14:—

గాంధిపార్కు నుండి, విద్యార్థులు, తదితరులు, విశేషముగా రాళ్ల వాన కురిపించిరనియు, త్రోవలో పోవుచున్న మోటారులకు రాళ్లు వేసిరనియు పోలీసువారు నిన్న సాయంకాలము తుపాకులను కాల్చిరి.

తుపాకి శబ్దములను విద్యార్థులమీద హిందు కళాశాల వద్ద పోలీసు వారిచే లాఠీచార్జి చేయబడెను. పోలీసువారు హిందూకళాశాల ఆవరణములో పోకూడుండగా, ప్రిన్సిపాలు శ్రీయుత రామచంద్రరావుగారు వారిని ఆక్షేపించిరి. తరువాత పోలీసువారు ఆవరణము విడిచి వెళ్లిరి. జనసమూహము, విద్యార్థులు గాంధిపార్కులో వెళ్లిరి. తరువాత పోలీసువారు తుపాకి శబ్దించిరి. జిల్లా సూపరెంటు గారు జిల్లా మేజస్ట్రేటు గారు కాల్పుల సమయమందు హాజరైయుండిరి. తరువాత సబ్ డివిజనల్ మేజస్ట్రేటుగారు ఒకనెలవరకు క్రి. ప్రొ. కో. 144 సెక్షనుక్రింద ఉత్తరువునుజారీచేసిరి.

ఈదినము స్కూళ్లు, కళాశాలలు, పాఠశాలలు, హోటలులు, కొన్ని ఆఫీసులు మూయబడెను.

ఈక్రిందివారు కాల్పులవల్ల చనిపోయిరి శ్రీయుతులు (1) పి. వి. సుబ్బరావు (విద్యార్థి) (2) విశ్వనాథశర్మ (3) వీరభద్రరావు (4) ఒక మహమ్మదీయ యువకుడు. ఆంధ్ర విశ్వకళాశాల విద్యార్థి శ్రీయుత జి. వి. సుబ్బారావు, బి. కాం. ఆసన్నచాల ప్రమాదస్థితిలో నున్నాడు. 9 మందికి గాయములు తగిలినవి. వారు చికిత్స పొందుచున్నారు.

టెలిఫోను, టెలిగ్రాము, తీగెలు చాల నరకు కోయబడినవి.

చీరాల నష్టము తగులబెట్టబడుట

చీరాల, ఆగస్టు 13:—

నిన్న మధ్యాహ్నం చీరాల ప్రజలు గుంపుగ బయలుదేరి చీరాల పేరాల వీధులలో తిరిగి అంగళ్లు మూయవలయునని వర్తకులను కోరిరి. అన్ని అంగళ్లు మూయబడినవి. విద్యార్థులందరు సమ్మెకట్టి గుంపులో చేరిరి. ప్రభుత్వపు కచ్చేరీలపద్దకు ఈ గుంపుపోయి వాటిని మూయింప ప్రయత్నించెను గాని లాభము లేకపోయినది. అంతట ఈ గుంపు స్టేషనుకు వెళ్లి తంతితీగెలను త్రెంచి టెలిగ్రాపు స్తంభముల నూడదెరికి, రైల్వే సిగ్నలు తీగెలను తెంపి, రైల్వే కాబినులు చెడగొట్టి, రైల్వేస్టేషనుకు నిప్పంటించిరి. స్టేషను రికార్డులతోసహా తగులబడెను. గూడ్సుషెడ్‌కు నిప్పంటించ గుంపు ప్రయత్నించెనుగాని పోలీసువారు పొగాకు కంపెని పనివారు అడ్డుపడి గుంపును తరిమిరి. ఇచ్చట పోలీసువారు లాఠీచార్జి జరిపిరి. కొన్నిచోట్ల రైలుబద్దీలు తీసివేయబడినవి.

రాత్రి పొద్దుపోయిన తర్వాత ఒంగోలు సబ్ కలెక్టరు కె. కె. దాసుగారు 30మంది రిజర్వు పోలీసులతో ఇచ్చటికి వచ్చిరి. నగరంలో కొన్నిచోట్ల లూటీలు జరిగినవి.

బందరులో లాఠీచార్జి

(స్వకీయవిలేఖరి)

బందరు, ఆగస్టు 14:—

బందరునుండి బెజవాడకు నిన్నమధ్యాహ్నమునుండి ట్రంకు టెలిఫోను, రాత్రి 11 నుండి టెలిగ్రాములు పనిచేయుటలేదు. బందరునుండి బెజవాడ రైలు లైనులో అచ్చటచ్చట రైలుపట్టాలు తొలగింపబడుటచే రైళ్ల రాకపోకలు సరిగా జరుగుటలేదు.

విద్యార్థుల సభ

నిన్నసాయంకాలం షుమారు 700 మంది విద్యార్థులు గొప్ప ఊరేగింపుచేసి తిలక్ చౌకులో మీటింగుచేసి, నిన్నరాత్రి బందరునుండి బెజవాడకు పోవు రైలులో టికెట్లు లేకుండ ప్రయాణముచేయాలని, అలారము గొల్సులు లాగి రైలునాపవలెనని తీర్మానించుకొని 6½ గంటలకు రైలుస్టేషనుకు వెళ్లిరి. అచ్చట సుమారు వెయ్యిమంది చేరిరి. తోడనే పోలీసువారు లారీలమీద అచ్చటకు వెళ్లిరి. విద్యార్థులు పోలీసులపై రాళ్లు రువ్వుటకు మొదలిడగా, లాఠీచార్జీ చేయబడెను, ఆ సమయమున జిల్లా సూపరింటెండెంటు రిజర్వు సిబ్బందితో హాజరై శాంతి నెలకొల్పిరి. సబుమేజస్ట్రేటుగారు, సబుడివిజనల్ మేజస్ట్రేటుగారు హాజరైరి. గబాటలో 12 మంది విద్యార్థులకు దెబ్బలు తగిలెను. సబుఇన్‌స్పెక్టరుగారు దెబ్బలుతగిలినవారి ఆస్పత్రిలో జాయినుచేసి బస్సులో తిరిగి వస్తుంటే ఆస్పత్రిగేటుముందు సుమారు 500 మంది గుమికూడి బస్సు డ్రైవరును రాళ్లతో కొట్టగా, ఇన్‌స్పెక్టరుగారు రైలు స్టేషనువద్ద నున్న రిజర్వును తెప్పించి విద్యార్థులను తరిమించివేసెను. గత రాత్రి ఆయుధ పోలీసు పార్టీ పట్టణములో గస్తీ తిరిగిరి.

నిన్నసాయంకాలము బందరు, బందరు పోర్టు రైలు లైనులోని సిగ్నలుయొక్క తీగలు తోసివేయబడెను. గత రాత్రి డా॥ పట్టాభిగారి యింటిముందున్న టెలిఫోను తీగలు తెగగొట్టబడెను. విద్యార్థులు ఈరోజునను పాఠశాలలకు వెళ్లలేదు.

ఆంధ్రజర్నలిస్టుల మహాసభ వాయిదా

ప్రస్తుతము దేశములోయున్న ఆలజడి చేతను రాకపోకలసౌకర్యములకు భంగము కలుగుచుండుటచేతను 16-8-42 వ తేదీ బందరులో జరుగవలసిన తృతీయ ఆంధ్ర జర్నలిస్టుల మహాసభ వాయిదావేయబడెను.

కర్నూలు నందికొట్కూరు మధ్య తంతి తీగెల విచ్ఛేదము

కర్నూలు, ఆగస్టు 15:—

కర్నూలు నందికొట్కూరు మధ్య 5 స్తంభాల మారమునకు తంతి తీగెలు తెగగొట్టబడెను. నందికొట్కూరు ఆళ్లగడ్డకు తంతి వార్తలు తీసుకొనుట లేదు. డిప్యూటీ పోలీసు సూపర్నెంటు దర్యాప్తు చేయుటానికి యీవాళ ఉదయము వెళ్లెను. (స్వ. వి.)

చెట్లుకొట్టరాదు

సింహళగవర్నరు ఉత్తరువు

కొలంబో, ఆగస్టు 16:—

చెట్లుకొట్టుటకు సంబంధించిన ఒక ఉత్తరువును సింగళగవర్నరు జారీచేసియున్నాడు. ఈ ఉత్తరువు వనరుకింది ఎంపిలయినట్లు, మానవుల జీవితమునకు ఆస్తికి నష్టము కలుగజేయు చెట్లుతప్ప తోటలపైనుండు కొట్టరాదు. మొదట లైసెన్సు పుచ్చుకొనిగాని చెట్లు కొట్టరాదు.

రూ. 70,000/-ల విలువగల ఆభరణములు ఇచ్చివేయబడుచున్నవి.



పసంచములో 8 వ చిత్రమును అద్భుత పరిశోధనయైనను మా "అమెరికన్ న్యూగోల్డు" న కెట్టి ఉపోద్ఘాతము అక్కరలేదు. అది ఇండియాలో అంతటను పేర్వడసినది. ఎన్నటికి మాయకుండనుండు కెమికల్ బంగారము యిదొక్కటే. దానినుండి నాజూకైన ఆభరణములు చేయవీలగును. అది ప్రజలచేతను, పత్రికలచేతను యేకగ్రీవముగ పొగడ్తల బడసినది. మా యీ "అమెరికన్ న్యూగోల్డు"ను ఇంకనూ వ్యాపింపజేయుటకు 6 తులముల అమెరికన్ న్యూగోల్డు, ఒకజత ఫాన్సీగాజులు, ఒకజత చెవిపోగులు, 2 చేతి ఉంగరములు గల ఒక శాంపిలు సెట్టును, యీ తగ్గింపు తీసివేయుకమును పేర్వాసుకొనువారికి పంపుదుము.

ఉచితము:—బొమ్మల క్యాటలాగు ఉచితముగా పంపబడును. a (2-94)

NEW GOLD SUPPLY COMPANY,
"Halka No. 47" LAHORE. (A.Pt.M.)

గర్భినోల్ (రిజిష్టర్డు)

గర్భాశయ సంబంధమైన జబ్బుల కన్నిటికి శ్రేష్టమైన ఔషధము. వేలకొలది డాక్టర్లకును, వ్యాధిగ్రస్థులకును కృప్తి గలిగించినది. ఒకసారి ఉపయోగించినచో దీనిగుణమును తెలుసుకొందురు. కెమిస్టు లందరివద్ద దొరకును.

విజయ ఫార్మసీ, తిరుచూరు.
VIJAYA PHARMACY, TRICHUR.

దంపతుల అన్యోన్య ప్రేమ

సువాసనగల సెంటు (Magic Scent)

ఇంతవరకు విని కని యెరుఁగని నూతన పరిశోధన. ఇది ఒకవిధమైన సెంటు. దీనిని వాసన చూచినచో మీ ప్రియురాలు మీపై అత్యంతానురాగము గలదై యుండును. మీ ప్రియురాలు గాని ప్రియుడుగాను మిమ్ము బాగా ప్రేమింపవలె ననుకొన్నచో దీనిని వాడిన చాలును. ఎల్లప్పుడు మీకు వశీకులై యుందురు. దీనికి కారణము ప్రేమ వ్యామోహమును రేకెత్తించును. బుడ్డి ఖరీదు రు. 1-15 పోస్టేజి 8 అ. వేరు. 2 బుడ్డీలు కొనువారికి పోస్టేజి ఉచితము. g (2-103)

KAILASHPATI AUSHDHALAYA (A.Pt.M.) P. B. 232, Lahore.

మదరాసులో అరెస్టులు

మదరాసు, ఆగస్టు 15:—

వెనుక జీరంపుచ్చుకొను ఏ. ఆర్. పి. వాలెంటుగా నుండిన శ్రీ యస్. విశ్వనాథన్ అను నతడు ప్రజలు యుద్ధపు హోయము చేయరాదని, కార్మికులు సమ్మెచేయాలని కోరునట్టి పత్రములను జార్జిటవునులో గోడలకు అంటించుచుండగా నిన్నసాయంత్రం అరెస్టుచేయబడెను. అతనిపై దేశరక్షణనిబంధనలు 38 (1) 38 (5) క్రింద నేరం మోపబడిన కేసు రెండవ రాజధాని మేజస్ట్రేటు శ్రీ ఏ. దొరైరాజ్‌గారి ఎదుట యీవాళ విచారణ జరిగెను. అట్టిపత్రములు తనవద్ద నుండే విషయమును ముద్దాయి ఒప్పుకొనినా తాను నిందితుడు కాదని చెప్పెను. కేసు విచారణ సోమవారమునకు వాయిదా వేయబడెను.

ఆర్యా దంపతులకు శిక్ష

శ్రీమతి కమలాదేవి ఆర్యా, అమెచ్చర్ శ్రీ మహేశ్వర ఆర్యాగార్లపై దేశరక్షణ సంబంధములక్రింద మూడు నేరాలకై వేయబడిన కేసును యీ దినము రెండో రాజధాని మేజిస్ట్రేటు శ్రీ ఏ. దొరైరాజ్‌గారు విచారించి ముద్దాయిలిద్దరికి చెరి 6 నెలల కఠినశిక్ష మొదటి రెండు నేరాలకును, 9 మాసాల కఠిన శిక్ష మూడో నేరానికిని విధించిరి. రెండు శిక్షలు ఏకకాలమునే అనుభవించవలసినట్లు ఉత్తరవు చేయబడెను.

ముద్దాయిలు ఆగస్టు 13 వ తేదీ తండియార్పేటలో పోలీసు కమిషనరు ఉత్తరవు అతిక్రమించి కాంగ్రెసు ఊరేగింపును జరిపి కాంగ్రెసుఉద్యోగ వాక్యాలు సలికారనిన్ని అక్రమవాఙ్మయం వారివద్ద నుండెననిన్ని, సైన్యవృత్తి వదలివేయవలెనని వారుసిపాయిలను కోరారనిన్ని వారిపై నేరాలు మోపబడెను.

దక్షిణఇండియా వాణిజ్యసంఘ విజ్ఞప్తి

మదరాసు, ఆగస్టు 15:—

దేశమునందలి ప్రస్తుత పరిస్థితులకు వగచుచూ, ప్రభుత్వమువారు వెంటనే రాజకీయ సమస్యలను పరిష్కరించి సమాధానానికి రావలెనని కోరుచూ దక్షిణఇండియా వాణిజ్యసంఘం నిన్న ఒకతీర్మానము గావించెను.

కాలికట్టులో బైస్కోపుతో కొట్టుట

కాలికట్టు, ఆగస్టు 14:—

తదనుగుణమను వదలిరమ్మని కోరి ఉద్యోగంతో యీవాళ మధ్యాహ్నం కాలికట్టు కళాశాల విద్యార్థులు కొందరు మలబారు క్రిస్టియను కాలేజీలో పని చేయుచున్న ఒక అధ్యాపకుని బైస్కోపుతో తీవ్రముగా కొట్టిరి. మొదట లైసెన్సు పుచ్చుకొనిగాని చెట్లు కొట్టరాదు.

స్త్రీలకు కుసుమవ్యాధి, ఋతుసంబంధమైన జబ్బులు, సంధ్యత్వము, గర్భస్రావము, గర్భాశయసంబంధమయిన వ్యాధులు

సుందరి సంజీవని

(సనుగ మాత్రలు)

వాడినచో అమోఘముగా గుణమగును.

వెల:—సీసా 1-కి రూ. 1, 3 సీసాలు రూ 2-10 లు.

మకరధ్వజ వటి

(బంగారు మిళితమైనది)

ఇంద్రియస్ఖలనము, స్వప్నస్ఖలనము, పుంస్త్వహీనత, వరముల బలహీనతకు శ్రేష్టమయినదిగా నిరూపింపబడినది.

వెల:—30 మాత్రల సీసా ఒకటికి రూ. 3.

UNJHA PHARMACY

ఉంఝా ఫార్మసి

గాంధీరోడ్, అహమ్మదాబాదు, బొంబాయి 2, పూనా సిటీ, ఉంఝా.

ఏజంట్లు:— వేంకటేశ అండ్ కో., ట్రంకురోడ్, నెల్లూరు.

షరా:— అన్నిచోట్ల ఏజంట్లు కావలెను. కోరువారికి ధరల జాబితా ఉచితము.

నోటీసు

భీమవరం సహకార పంట గుణముల విక్రయసంఘం లిమిటెడ్,

నెం. 113 W. G భీమవరం.

మహాజనసభ నోటీసు

భీమవరం సహకార పంటగుణముల విక్రయ సంఘముయొక్క మహాజనసభ 23-8-42 ఆదివారం పగలు 1 గంటకు భీమవరంలోని వెల్కం సినీమా హాలయందు జరుపుటకు యేర్పాటు చేయబడెను. యీ దినము హంశములు చర్చింపబడును. గాన తాము తప్పక దయచేయ ప్రార్థించుచున్నాను.

హంశము:— 1. సంఘముయొక్క పరిపాలనా నివేదిక అంగీకరించుట, 2 1940-41 సం॥ ఆడిటు రిపోర్టు అంగీకరించుట, 3. సంఘముయొక్క నూతన పాలకవర్గ సభ్యుల నెన్నుకొనుట, 4 1942-43 సం॥ తాలూకు బడ్జెట్టు అంగీకరించుట, 5. ఇతర సహకార సంస్థలకు యీసంఘము తరఫున ప్రతినిధుల నెన్నుకొనుట, 6. బైలాలు మార్పులు అంగీకరించుట, 7. అధ్యక్షులవారిచే ప్రవేశపెట్టబడు యితర హంశములు.

(పాలకవర్గమువారి అనుమతిని)

నండూరి గున్నేశ్వరరావు.

కార్యదర్శి.

మార్కెట్టు వేలాము నోటీసు

విశాఖపట్నం జిల్లాబోర్డు ఆఫీసు

ఇందువల్లను సమస్తమయిన వారికిని తెలియజేయడమేమనగా, జిల్లాబోర్డు వారి అధికారములో యున్న కొత్తవల్స వారపుసంత 1942.43 వ స॥ము కు వసూలు చేసుకొనె అధికారము విశాఖపట్టణము లోకలుఫండు ఆసిస్టాంటు ఇంజనీరుగారిచే కొత్తవల్స పంచాయతి బోర్డు ఆఫీసులో తే 18-8-1942 దీ మంగళవారము (సంతరోజున) మధ్యాహ్నం ఒంటిగంటకు వేలము చేయబడును. పాట పాడ తలపుగలవారు వేలము మరుసు నూరించు వేలము నోటీసు జిల్లాబోర్డు ఆఫీసు నోటీసు బల్లపయినిగాని, విశాఖపట్నము ఆసిస్టాంటు యింజనీరు ఆఫీసులోగాని కృష్ణదేవపుపేట లోకలుఫండు ఏరియా ఆఫీసులోగాని, కొత్తవల్స పంచాయితిబోర్డు ఆఫీసులోగాని చూడవచ్చును.

ఏ. జోగినాయుడు,

విశాఖపట్నం జిల్లాబోర్డు ప్రెసిడెంటు.

ఆస్ట్రాఖానువైపుగా జర్మనుల క్రొత్తపోటు

స్టాలిన్‌గ్రాడ్ రంగములో శత్రుదాడులు-రషియనుల ప్రకటన

క్యూబాన్‌నది దాటుప్రయత్నమున నాజీలకు విశేషనష్టము

లండను, ఆగస్టు 15:—

రష్యాలో, శత్రువులు ఆస్ట్రాఖాను వైపుగా క్రొత్తపోటు ప్రారంభించియున్నారు. స్టాలినుగ్రాడ్ రంగములో తమ దాడి సంపూర్ణముగా భగ్నమగుటచేత బహుశః జర్మనులీ క్రొత్తప్రయత్నమునకు గడంగియుందురు. ఇట్టి శత్రువులు కందకములు త్రవ్వుకొనుచున్నారు. స్థితిగతులు యిదివరకు కంటె అధ్వాన్నముగానే యున్నను ఘోరమగు సోవియటు తిరుగుదాడులు జరుగుచున్నవి.

కాకససులలో క్యూబాన్‌నదిమీద రష్యావారికంటను శత్రువును నిలువరించుచునే యున్నారు. క్యూబాన్‌నదిదాటు ప్రయత్నమునందు జర్మనులకు విపరీతనష్టము కలిగినది.

నవొరోసిస్కుకు నాజీలు 30 మైళ్ల దూరములోనున్నారు

లండన్, ఆగస్టు 16:—

మాస్కోయందలి రాయిటరు విలేఖరి ఈ క్రిందివిధముగా తెలుపుచున్నాడు:—

14 రోజులనుండియు, ఎంత జననష్టమునకైనను, ఎంత యంత్రసామగ్రి నష్టమునకైనను నెనుదీయక సోవియటు రక్షణశ్రేణులను ఛేదించుటకు జర్మనులు సర్వశక్తుల నుపయోగించుచున్నారు. జర్మనులు తమ బలమంతటిని కేంద్రీకరించి దీక్షతో కొనసాగించిన దాడి నెదుర్కొనజాలక రష్యావారు కొంత జనుకకుతగ్గినను జర్మనులు రష్యావారి రక్షణశ్రేణులను ఛేదింపలేదు. స్టాలిన్‌గ్రాడు నైరృతిని, డాన్ మలుపులో సోవియటువారు భీషణముగా ఫిరంగులుకాల్పుటచేత, జర్మనులుతమటాంకు దాడిని మానివేయవలసి వచ్చెను. ఒక స్థలమున జర్మనులు డాన్‌నది మలుపువద్దకు వచ్చిరి. గాని, వారిని రష్యావారు జనుకకు తరిమివేసిరని పూర్వవార్తలు తెలిపెను. ఈ యుద్ధములో 700 జర్మనులు హతులైరి.

కాకససులో శత్రువులు సోవియటు రక్షణ శ్రేణులలోనికి చాల పరకు చొచ్చుకొని వచ్చిరి. సంఖ్యలో జర్మనులు హెచ్చుగా నున్నారు. క్యూబాన్‌నది దిగువభాగమున రష్యాసేనలు పోరాడుచున్నవి. ఈ ప్రాంతము ఒకప్రదేశమున నల్లసముద్ర రేవగు నవొరోసిస్కుకు 30 మైళ్ల దూరమున మాత్రమున్నది.

గ్రోజ్నీ నూనెనులకు పశ్చిమముగా 150 మైళ్ల దూరమున యిప్పుడు ఘోరసంగ్రామము సాగుచున్నది. శత్రుదాడులు మరలింపబడినవి.

రంగమునందలి మధ్యభాగమున అనగా చర్కాసెస్క్ వద్దను, మెయికాప్ వద్దను పోరాట మింకను జరుగుచున్నది. స్థితిగతులలో మార్పేమియు లేదు. కాకససులను స్టాలిన్‌గ్రాడ్ రంగమునకును మధ్యగల 200 మైళ్ల ప్రదేశములో పోరాటనువిషయమై యేమియు తెలుపబడలేదు. వాల్గా దక్షిణమున ఆస్ట్రాఖాను వైపుగా ముందుకు వెళ్లుటకు జర్మనులు ప్రయత్నించుచున్నారు.

స్టాలిన్‌గ్రాడురంగమున రష్యావారు శత్రువును నిలువరించిరి

లండను, ఆగస్టు 15:—

స్టాలిన్‌గ్రాడు దూరద్వారములవద్ద సోవియటు సైనికులు జర్మనుసేనల నింకను నిలవరించుచున్నారని మధ్యాహ్నసమయమున సోవియటు అధికారులు ప్రకటించిరి. నగర నైరృతి దిక్కునను, వాయవ్య దిక్కునను జర్మనులను రష్యావారు నిలవరించుచున్నారు. శత్రువు క్రొత్తగా చేసిన అనేకదాడులను రష్యావారు మరలించిరి. నిన్నరోజంతయు జర్మనులు టాంకు దాడులు గావింపగా మరఫిరంగులు కాల్చి సోవియటుసైనికులు ఈ దాడులను మరలించిరి. స్టాలిన్‌గ్రాడు నైరృతిదిక్కున ఒక ప్రదేశములో రష్యావారు ఇనుకతగ్గినను శత్రువు యెక్కువముందుకు వెళ్లజాలకపోయెను.

జర్మనులు ఆత్మరక్షణ గావించుకొనుచున్నారు

తమ టాంకులు చాలనష్టమగుటచేత, కాటిలెనికోవో ప్రాంతమున జర్మనులు ఆత్మరక్షణ గావించుకొనుచున్నారనియు, కందకములు త్రవ్వుకొనుచు, తమ స్థావరములచుట్టు ముండ్లతీగెలను కట్టుకొనుచున్నారనియు ఒక ఏజన్సీవిలేఖరి తెలుపుచున్నాడు. కొంతకాల మూరకుండి, జర్మనులు తమ స్థావరములను బలపరుచుకొని మరలఒకగొప్పపోటు చేయుదురని యిచ్చట తలచుచున్నారు.

ఆకాససులలో ఘోరయుద్ధము

కాకససులలో క్రాస్నడారుచుట్టు ఘోరయుద్ధము జరుగుచున్నది. ఇచ్చట జర్మనులు క్యూబాన్‌నది దాటుటకు అనేక ప్రయత్నములు చేయుచుండిరి. కాని వారి ప్రయత్నములు ఫలప్రద మగుటలేదు. సోవియటు రక్షణశ్రేణులలోనికి శత్రువులు చాల దూరము చొచ్చుకొని వచ్చినను వారుస్థావరముల నేర్పరుచుకొనజాలక పోయిరి. మెయికోప్, చెర్కెస్కుచుట్టు జరుగుచున్న పోరాటము విషయమై క్రొత్తగా వార్తలు రాలేదు. కాని జర్మనుల గమనవేగము తగ్గినమాట నిశ్చయమని కడపటివార్త సూచించుచున్నది.

స్టాలిన్‌గ్రాడ్ నైరృతిని రష్యావారి తీవ్ర ప్రతిఘటన

స్టాలిన్‌గ్రాడ్ నైరృతిని 95 మైళ్ల దూరమునున్న కాటలనికోవోవద్ద సోవియటు సైనికులు, క్రొత్త జర్మను దాడులను తీవ్రముగా నెదుర్చుచున్నారు. శత్రువు పురోగమనమునకు అంతరాయము కలిగినది.

బ్రయిన్స్క్ రంగము

బ్రయిన్స్క్ రంగములో రష్యావారు చాల ప్రాముఖ్యముకల ఒకమిట్టనాక్రమించి, తరువాత శత్రువులు గావించిన దాడుల నన్నిటిని మరలించిరి.

వాల్గాకు 180 మైళ్ల దూరము వచ్చినట్లు జర్మనుల ప్రకటన

లండన్, ఆగస్టు 15:—

వాల్గానదికి 180 మైళ్ల దూరమునున్న ఒక ప్రదేశము చేరినట్లు జర్మనులు నేడు చెప్పుచున్నారు.

కాటలనికోవో దక్షిణమున సోవియటు సైనికులు తమ స్థావరములను బలపరుచుకొనిరనియు, ఇదివరకు కంటె సోవియటు సైన్యములు బలీయముగా నున్నవనియు తెలియుచున్నది. ఆస్ట్రాఖానునైపు జర్మనులు క్రొత్తపోటు ప్రారంభించినదనగూడ తెలియుచున్నది. ఆస్ట్రాఖాను ప్రాంతములోనున్న ప్రదేశము దుర్గమమైనది. శత్రువులు సులభముగా ఈ ప్రదేశములో ముందుకు వెళ్లలేరు. ఉత్తరమునుండియు, వాయవ్యదిక్కునుండియు స్టాలిన్‌గ్రాడునొకటికి వెళ్లుప్రయత్నము సంపూర్ణముగా భగ్నముకాగా జర్మనులు ఆస్ట్రాఖాన్‌వైపుగా ముందుకు వెళ్లప్రయత్నించుచున్నారని యూహింపవచ్చును. శత్రువులు చాల ప్రదేశములలో కందకములు త్రవ్వుకొనుచున్నారు. మరియొక పోటుచేయగ లందులకై క్రొత్తసైన్యములకొరకు వేచియున్నారు.

ఉత్తరముగా స్టాలిన్‌గ్రాడువైపు జర్మనులు కొంతదూరము ముందుకు వచ్చిరి. ఇప్పుడు వారు పట్టణమునకు దగ్గరగా నున్నారు. డాన్‌నది మలుపులో సోవియటు సైన్యములు ఘోరముగా దాడులు గావించుచున్నారు. ఇచ్చట కొంతదూరము, అచ్చట కొంతదూరము శత్రువులు ముందుకు వెళ్లగలిగినను గొప్ప విజయమేదియు శత్రువులకు కలుగలేదని ఒక ఏజన్సీ వార్త తెలుపుచున్నది. కాకససులలో, క్రాస్నడార్ జిల్లాయందలి క్యూబానునది ప్రాంతములో సోవియటు సైనికులు జర్మనుల నింకను నిలువరించుచున్నారు. నదిదాటు ప్రయత్నమునందు వారికి విశేష నష్టములు కలిగినవి. తుపాకులుధరించిన చిన్న జర్మను జట్లు మాత్రము చిన్న బోట్లలో నది దాటగలిగిరని తలచుచున్నారు.

జర్మను రవాణానావల విధ్వంసము

మాస్కో, ఆగస్టు 15:—

9 జర్మను రవాణానావలను ముంచి మూడుసోవియటు జలాంతర్గాములు ఇప్పుడే ఒక బాల్టిక్‌సముద్ర రేవు చేరినవి. వీనిలో 10 వేల టన్నుల రవాణా నావ యొకటి, మొత్తము 16 వేల టన్నులుమోయు నావలు 5, ఒక యుద్ధబోటు కలవు.

మధ్యధరాసముద్ర కాన్వాయి యుద్ధము

10 శత్రువిమానముల నాశము

కైయిరో, ఆగస్టు 15:—

ఆగస్టు 13, 14 తేదీలలో మధ్యధరాసముద్రమునందు జరిగిన కాన్వాయియుద్ధములో బ్రిటిషువిమానములు 10 శత్రువిమానములను పడగొట్టెనని అధికారికత్వ ప్రకటింపబడినది. "సమగ్రమైన నివేదిక లింకను రాలేదు. శత్రువుల విమానసమూహములు చాల హెచ్చుగా నుండునని యూహింపబడుచున్నది." అని అధికారులప్రకటన తెలుపుచున్నది.

ఆఫ్రికా యుద్ధము

పశ్చిమఎడారిలో విమానసంచలనము

కైయిరో, ఆగస్టు 15:—

మధ్యప్రాచ్య సైనికాధికారులు నేటి క్రిందిప్రకటన గావించుచున్నారు:—

గతరాత్రి మన కాపలాసైనికులు రంగమంతటియందును చురుకుగా పనిచేసి, మధ్యరంగమునందు వారు శత్రుస్థావరములపై దాడిచేసి, శత్రువుకు చాల జననష్టము కలుగజేసిరి. నిన్న మన భూసేనల విమానములపై చెప్పదగినదేమియు లేకుండెను. పశ్చిమ ఎడారిలో విమానసంచలనము హెచ్చుగా నుండెను. మన తేలికపారుబాంబర్లుఎల్ ఎడాబా వద్ద శత్రువిమానములు దిగు ప్రదేశములపై దాడి గావించెను. మన ఫైటర్లు 8 శత్రువిమానములను పడగొట్టెను.

రాబాల్ ప్రాంతమున శత్రువిమానవల్లపై దాడి

మెల్‌బోర్న్, ఆగస్టు 15:—

రాబాల్ ప్రాంతములో కేంద్రీకరింపబడిన శత్రువిమానవల్లపై యిప్పుడు బ్రిటిషు విమానదళములు దాడులు చేయుచున్నవని ఒక ఏజన్సీ వార్త తెలుపుచున్నది.

300 ఫ్రెంచివారు స్వతంత్ర ఫ్రెంచి సేనలో చేరిరి

లండన్, ఆగస్టు 15:—

300 ఫ్రెంచివారు విచీ ప్రభుత్వమువారి క్రింద నున్న మార్టినిక్ ద్వీపమునుండి తప్పించుకొని వచ్చి స్వతంత్ర ఫ్రెంచి సైన్యములో చేరిరి. వీరు బ్రిటిషుద్వీపములకు డామినిక్ సెంట్‌లూయీలలో దిగిరి. వీరిలో చాల మంది చిన్నబోట్లలో తప్పించుకొని వచ్చిరి. బ్రిటిషు జాలరులు వీరిలో కొందరిని తీరమునకు చేర్చిరి.

రోడ్సుపై బ్రిటిష్ నౌకలదాడి

లండన్, ఆగస్టు 15:—

బ్రిటిషు నౌకాదళ మొకటి తూర్పు మధ్యధరాసముద్రమునందలి ఇటలీ ద్వీపమగు రోడ్సుపై దాడి గావించెను. ఈ దాడి 12 నిమిషములు జరిగెను. ఇట్టి దాడి జరుగునని ఇటలీ వారనుకొని యుండలేదు. హఠాత్తుగా బ్రిటిషు నౌకలు దాడి గావించెను. దీపపు కాంతులను క్రిందపడవేసి బ్రిటిషు విమానములు నౌకలకు తోడ్పడెను. ఈ సమయమునాడే బ్రిటిషు బాంబర్లు. మరియొక విమానాశ్రయముపై దాడి గావించెను. మన బ్రిటిషు విమానము లన్నియు సురక్షితముగా తిరిగి వచ్చెను.

బ్రిటెన్‌పై శత్రువిమానదాడి

లండన్, ఆగస్టు 15:—

ఒక శత్రుబాంబరు ఈస్టాంగ్లియా లో ఒక పట్టణముపై బాంబులు వేసెను. ఎవ్వరు మరణింపలేదు; ఎవ్వరికిని గాయములు తగులలేదు.

ఫ్రెంచి తీరమునుండి కాల్పులు

శత్రువులు ఫ్రెంచితీరమునందు నెలకొల్పిన గొప్ప ఫిరంగులనుండి గుండ్లువచ్చి దోవరులో పడెను. నష్టమేమియు జరుగలేదు.

ఫ్రెంచి ఉత్తరఆఫ్రికాకు అమెరికా సరఁకులు

లండన్, ఆగస్టు 15:—

అమెరికాకును, ఫ్రెంచి ఉత్తర ఆఫ్రికాకును మధ్యసరుకుల మార్పిడి మరల ప్రారంభమైనదని వాషింగ్టనులో ప్రకటన జరిగినది. సరుకులతో రెండు ఫ్రెంచి నావలు కౌసబ్లాంకాకు బయలుదేరి వెళ్లినవి. ఈ వస్తువుల సరఫరాను అమెరికను కౌన్సులర్ ఏజంట్లు అజమాయిషీ చేయుదురు.

రష్యాలో బ్రిటిషు పత్రిక

నేడు ప్రథమసంచిక వెలువడును

మాస్కో, ఆగస్టు 15:—

రష్యాయందలి బ్రిటిషు వార్తా పత్రిక యొక్క ప్రథమసంచిక నేడు వెలువడును. పత్రిక పేరు 'బ్రిటిషు ఏన్లెయి'. దీనిలో 8 పుట లుండును. యుద్ధ సమయములో బ్రిటిషు కుటుంబము లెట్లు జీవించుచున్నవో పత్రిక వర్ణించుచున్నది. ఈ పత్రికా ప్రచురణమునకు సోవియటు అధికారు లన్ని సౌకర్యములు నొసంగియున్నారు.

ఆహారధాన్యముల రవాణాకు లైసెన్సులు

మద్రాసుప్రభుత్వ ప్రకటన

చెన్నపురి, ఆగస్టు 15:—

మద్రాసుప్రభుత్వమువారు యీ క్రిందికీర్తిగా ఒక ప్రకటన చేసిరి.

బియ్యమున్నూ సరిధాన్యమున్నూ మదరాసురాజధానిలోనుండి మరొక రాజధానిలోనికి రవాణాచేయవలెనంటే ఏలిభముగా గవర్నమెంటువారి లైసెన్సునుపొందవలెనో అదేరీతిగా 1942 సం॥ ఆగస్టు 20 తేదీనుండియు, రాగులు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్నలున్ను కందులు, నువులు, పెసలు, సెనగలు, ఉలవలున్ను లైసెన్సులేకుండా మద్రాసురాజధానినుండి మరొక రాజధానికి రవాణాచేయవీలులేదు. అట్టిలైసెన్సులకొరకై నిర్ణీతదరఖాస్తు ఫారంమీద దరఖాస్తు దాఖలుచేయవలెను. మద్రాసురాష్ట్ర సివిలు సప్లయిల కమీషనరుగాని అతనిచే అధికారమొసంగబడిన మరొక ఆఫీసరుగాని అట్టి లైసెన్సులను జారీచేయుచు అట్టి లైసెన్సు 8 మాసములవరకే అమలులో నుండును. లేదా, ఆ లైసెన్సులో చెప్పబడిన సరకును రవాణాచేయుటకు తగినసీర్పాటులను రవాణాదారు చేయుటలేదని తోచినయెడలహూడా అతని లైసెన్సు రద్దుచేయబడును. ఈ లైసెన్సు కొరకుండి బంకొకరికి ట్రాన్సఫరు చేయుటకు వీలులేదు. ఏ వర్తకుడైనా ఇతరుల లైసెన్సులను ట్రాన్సఫరు పొందిన యెడల, అతనివద్దనున్న సొంతలైసెన్సులు కూడా రద్దుచేయబడును అతనికి అనుమతి క్రొత్తలైసెన్సులు లభించుట కష్టము.

కాని, పుడుక్కోట, సంస్థానమునకు, బనగానపల్లె సంస్థానమునకు సంబంధించిన రవాణా చేయబడు జొన్నలు సజ్జలు రాగి మెట్టధాన్యములకుగాని పప్పుధాన్యములకుగాని లైసెన్సు ఉత్తరవు వర్తించదు. ప్రయివేటు సొంతఖర్చుకొరకై ఎవ్వరైనను ఒక లైసెన్సునుండి సరకును ఒక్కమారుగా తెప్పించుకొనేయెడల అట్టి రవాణాకుకూడా ఈ ఉత్తరవు వర్తించును.



ముద్దుపేర్లు మార్చబడును

జపానువారు సింగపూరును స్వాధీనం చేసుకొన్న వెంటనే ఆనగరమునకు జపానీ పేరుపెట్టినారు. జపానువారికి మన పట్టణములను, పవిత్రస్థలములను వశపరచుకోవడం

తటస్థించినట్లయిన వీటికిగూడ ఇదేవిధంగా జరుగుతుంది. మత సాంప్రదాయములను చారిత్రాత్మకంగాను పేరుగాంచిన పట్టణము లన్నియు కళావిహీనమగుటయే గాక జపానీ పేర్లను న్యాయ చట్టానుకూలంగా పెట్టుకుంటారు. దేశంలోని అభిప్రాయములను లెక్కచేయరు. ఈ దేశమునకు వెందిన మనమందరము ఎట్టి పోరాటము లేకుండ అట్టి ఆదరణకు ఒప్పుకోగలమా? లేదు. సంయుక్త ప్రతిఘటన చేసి ఈ రాష్ట్రములను ఎదుర్కొందము.

జపానువారి నెదుర్కొనుటకై దేశీయయుద్ధరంగమును తయారు చేయుడు.

మలబద్ధకము తత్సంబంధమగు ప్రేగుల వ్యాధులకు

పారగాల్

వాడుడు

పారఫిన్ ఆయిల్, అగర్, ఔషధములతో తయారుచేయబడిన శ్రేష్టమైన, తీయని ఔషధము.

దీనిని సేవించినయెడల సుఖనిద్రచేయనుసన్నట్లు జేయును.

BENGAL CHEMICAL
CALCUTTA :: BOMBAY
ఏజంట్లు:
యస్. డి. గౌండర్ అండ్ కో.,
17, పైలర్సరోడ్డు, కీల్పాక్, మద్రాసు.

దివ్యమైన తరుణము

మీరు స్యాగోట్లును దాని ఆభరణములను యింకెప్పటికైన కొనుటకు ముందు ఉచితముగా పంపబడు మా ఫ్యాన్సీ ఆభరణముల ఏజన్సీమరతులకు వ్రాసికొనుట మంచిది. ఒక జత మెడగొలుసు, ఒక జత గాజులు, ఒక జత చెవిపోసులు, రెండు బొంబాయి ఫాషన్ ఫాన్సీ ఉంగరములు కావలసినవారు పోస్టేజికి ప్యాకింగుకు గాను రు 0-8-0 స్టాంపులుగాని లేక మనియార్డరుగాగాని పంపకొనుడు.

గ్యారంటీ:—ఏజంట్లు ఆ ఆభరణములను ఎప్పుడైనను పూర్తిధరకు వాపసుచేయవచ్చును. ఖాతాదారులువారు వాడిన ఆభరణములను సరిగాలో గా సగంధరకువాపసుచేయవచ్చును.

The General Commercial Agency (A. P. Mt)
Batala (Punjab) N. W. Rly.

Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty St., Madras.



సాలమన్ ద్వీపములు

మిత్రమండలివారికి అనుకూలమగు స్థితి

వాషింగ్టను, ఆగస్టు 15:—

సాలమన్ ద్వీపములలో స్థితిగతులు మిత్రమండలివారికి అనుకూలముగానే యున్నవని నేడు వాషింగ్టనులో చెప్పిరి. సాలమన్ ద్వీపములలో దిగిన నౌకానికులు తామాక్రమించుకొన్న ప్రదేశమును బలపరచుకొనుచుండిరి. ఈప్రకటన చాల ఆశాజనకముగా నున్నట్లు వాషింగ్టన్ బృందములు తలచుచున్నారు.